

కిరండోల్ రైలుకు అదనపు కోచ్‌లు
» డిసెంబరు 1 నుంచి జనవరి 2వ తేదీ వరకూ... - 8లో



పవర్ హౌస్
» మీ ఇల్లే ఓ విద్యుదుత్పత్తి కేంద్రం
» కేంద్ర ప్రభుత్వ రాయితీతో సౌర విద్యుత్ సులభతరం - 8లో

ప్రాణాలు తీస్తున్న ఫార్మా కంపెనీలు

వరుసగా ప్రమాదాలు

నిర్లక్ష్యం వీడని యాజమాన్యాలు



» తూతూమంత్రంగా అధికారుల తనిఖీలు

» నష్టపరిహారం పంపిణీతోనే సరి... చర్యలు శూన్యం
» కమిటీల నియామకంతో కాలక్షేపం
» ఐదేళ్లలో 43 ప్రమాదాలు... 91 మంది మృతి
» 17 మందిని బలిగొన్న ఎసెన్షియా ప్రమాదం
» మూడు నెలలవుతున్నా ఇప్పటికీ అందని నివేదిక
» తాజాగా రాగూర్ ఫార్మాలో ఇద్దరి మృతి
» కొద్దిమంది అధికారులు తనిఖీ చేస్తున్న కంపెనీల్లోనే ప్రమాదాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఫార్మా కంపెనీలలో ప్రమాదాలకు అంతులేకుండా పోతోంది. భారీ ప్రమాదాలు జరిగి పెద్ద సంఖ్యలో కార్మికులు చనిపోతున్నా అధికారులు కఠిన చర్యలు చేపట్టడం లేదు. చనిపోయిన వారికి నష్టపరిహారం ఇచ్చేస్తే సమస్య పరిష్కారం అయిపోయినట్టుగా భావిస్తున్నట్టున్నారు. అందుకే యాజమాన్యాల నిర్లక్ష్యానికి చెక్ పెట్టలేకపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలోని రాంకీ ఫార్మాసిటీలో 100, అచ్యుతాపురం సెజ్‌లో 210 పరిశ్రమలు ఉన్నాయి. ఇవికాకుండా నక్కపల్లిలో హెటిరో డ్రగ్స్ కంపెనీ ఉంది. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా కంపెనీలో మూడు నెలల క్రితం భారీపేలుడు సంభవించి 17 మంది చనిపోయారు. దీనిపై అన్ని శాఖల అధికారులు హడావుడి చేశారు. కూటమి నేతలు పరామర్శలకు క్యూకట్టారు. ప్రమాదం ఎలా జరిగిందో తేల్చడానికి ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. మూడు నెలలు అవుతోంది. ఇప్పటివరకూ నివేదిక ఇవ్వలేదు. అంత భారీ ప్రమాదాన్ని కూడా అధికారులు తేలిగ్గా తీసుకోవడం, యాజమాన్యంపై కఠిన చర్యలు లేకపోవడం వల్ల మిగిలిన సంస్థలు కనీస జాగ్రత్తలు కూడా తీసుకోవడం లేదు. ఈ ఏడాది ఆగస్టు 21న ఎసెన్షియాలో ప్రమాదం జరగ్గా, ఆ మరుసటిరోజే సినర్జీస్‌లో ప్రమాదం చోటుచేసుకుని మరో నలుగురు చనిపోయారు. ఆ తరువాత రాంకీ ఫార్మాసిటీలో కూడా ప్రమాదం జరిగితే గుట్టుగా ఉంచి రెండు రోజుల వరకూ బయటకు తెలియనివ్వలేదు.

తాజాగా రాగూర్ కంపెనీలో ప్రమాదకరమైన హైడ్రోక్లోరిక్ వాయువు లీకై గురువారం నాటికి ఇద్దరు మరణించారు. వాస్తవానికి లీకైంది క్లోరిన్ వాయువని ఆ రంగానికి చెందినవారు చెబుతున్నారు. గత నెలలోనే ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు ఆ కంపెనీకి తనిఖీకి వెళ్లారు. ఎటువంటి సూచనలు చేశారో బయట పెట్టడం లేదు. అన్నీ సరిగ్గా ఉంటే ప్రమాదం ఎలా జరిగిందనేది అనుమానంగా ఉంది.

ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ల తనిఖీలు ఓ ప్రహసనంలా సాగుతున్నాయి. వారి అవినీతికి హద్దులు లేవు. సెంట్రల్ పోర్టల్ ద్వారా ఏ తేదీన ఏ అధికారి ఏ కంపెనీకి తనిఖీకి వెళ్లాలనేది సూచిస్తున్నారు. ఒక్కొక్కరిని ఒకేరోజు నాలుగైదు

... మిగతా 6వ పేజీలో

రాగూర్ ఫార్మా ప్రమాదంలో మరొకరి మృతి

» రెండుకు చేరిన మృతుల సంఖ్య
» మరో 18 మందికి అస్వస్థత
» ఆస్పత్రులకు తరలింపు



చికిత్స పొందుతూ మృతి చెందిన సీహెచ్. వీరశేఖర్

- 6లో

ఉన్నతాధికారుల సూచనలు

» ప్రతి కంపెనీ నైపుణ్యం కలిగిన కార్మికులను నియమించుకోవాలి.
» 3 నెలలకు ఓసారి మాక్ డ్రిల్ నిర్వహించాలి.
» స్టాండర్డ్ ఆపరేటింగ్ విధానాలు పాటించాలి.
» ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి.
» ప్రమాదం జరిగిన వెంటనే అలారం మోగేలా వ్యవస్థ (బజరింగ్) పెట్టుకోవాలి.
» అక్కడ జరిగే ఉత్పత్తి ప్రక్రియ, రసాయనాలపై ఉద్యోగులకు, కార్మికులకు అవగాహన కల్పించాలి.

ఈ ఐదేళ్లలో ఫార్మా కంపెనీల్లో జరిగిన ప్రమాదాలు...

ఏడాది	ప్రమాదాలు	మరణాలు
2019-20	13	17
2020-21	9	31
2021-22	11	12
2022-23	6	11
2023-24	4	20
మొత్తం	43	91

ఇవీ లోపాలు

» కంపెనీ సెల్ఫ్ సర్టిఫికేషన్ ఇస్తే సరిపోతుందని, ఇంకెవరూ తనిఖీ చేయాల్సిన అవసరం లేదని వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు వెనక్కి తీసుకోవాలి.
» అన్ని తనిఖీలు పూర్తయ్యాకే కంపెనీలకు ఎన్‌ఓసీ ఇవ్వాలి.
» సేఫ్టీ ఆడిట్ తప్పనిసరి.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పోలీసుల చేతివాటం

» తనిఖీలో పట్టుబడిన వారి నుంచి అనధికారికంగా డబ్బులు వసూలు
» కోర్టుకు తరలించకుండా తప్పించేస్తున్న వైనం
» ఎప్పుడో ఫిర్యాదు అందితేనే తప్ప దృష్టిపెట్టని అధికారులు
» ఇటీవల కాలంలో ఇద్దరు ఎస్ఐలు, స్టేషన్ రైటర్, హోంగార్డు సస్పెన్షన్
» ...అయినా మారని మిగిలిన వారి వైఖరి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు నిర్వహిస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కొంతమంది పోలీసులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకూ ప్రధాన కూడళ్లలో పోలీసులు బ్రీత్ అనలైజర్లతో తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వారి నుంచి కొందరు పోలీసులు డబ్బులు తీసుకుని కోర్టులో ప్రవేశపెట్టకుండా తప్పించేస్తున్నారు. దీనిపై ఎవరో ఫిర్యాదు చేస్తేనేగానీ ఉన్నతాధికారులు గుర్తించడం లేదు.

నగరంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు కొంతవరకూ మద్యం సేవించి వాహనాలను నడపడం కారణమని పోలీసులు గుర్తించారు. దీంతో మద్యం సేవించి వాహనాలు నడపడాన్ని నియంత్రించేందుకు ఎక్కడికక్కడ బ్రీత్ అనలైజర్లతో గత కొన్నేళ్లుగా తనిఖీలు చేస్తున్నారు. వాహనం నడిపే వ్యక్తి బ్రీత్ అనలైజర్‌లోకి గాలి ఊదినప్పుడు మద్యం సేవించినట్టు తేలితే వారిపై కేసు నమోదుచేసి వాహనం సీజ్ చేయాలి. అలా పట్టుబడిన వ్యక్తి మరుసటిరోజు ఉదయం పోలీస్ స్టేషన్‌కు వెళితే అతని వద్ద నుంచి ఫోన్ నంబర్, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు తీసుకుని వాహనాన్ని ఇచ్చేస్తారు. కోర్టుకు హాజరవ్వాల్సి వచ్చినప్పుడు ముందుగానే ఫోన్ ద్వారా సమాచారం ఇస్తున్నారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వారికి న్యాయమూర్తి జరిమానా లేదంటే జరిమానాతోపాటు జైలుశిక్ష కూడా విధిస్తున్నారు.

అయితే మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే చాలామంది కేసు లేకుండా చూడాలంటూ పోలీసులను ప్రాధేయపడుతుంటారు. అవసరమైతే జరిమానా అక్కడే విధించేస్తే... చెల్లించి వెళ్లిపోతామని వేడుకుంటారు. కేసు నమోదుచేస్తే స్టేషన్ చుట్టూ, కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తుందని, భవిష్యత్తు ఏదైనా సమస్య రావచ్చుననే భావనతో ఎంతో కొంత అక్కడే చెల్లించేందుకు

... మిగతా 6వ పేజీలో

జబ్బరుతోటలో అతిసార

నాలుగేళ్ల బాలిక మృతి

» పదుల సంఖ్యలో బాధితులు
» ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం



డయేరియా ప్రబలిన ప్రాంతంలో కాలువ పక్కనే ఉన్న కొళాయి

మహారాణిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని ఫిషింగ్ హార్బర్ సమీపాన గల జబ్బరుతోటలో అతిసార ప్రబలింది. గడచిన నాలుగు రోజుల్లో సుమారు 39 మంది డయేరియా బారినపడ్డారు. వీరిలో చికిత్స పొందుతూ నూకరాజు, లక్ష్మిల కుమార్తె గీతిక (4) ఆదివారం మృతిచెందగా, మరో ఏడుగురు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మిగిలిన 32 మంది ఆరోగ్య శాఖ పర్యవేక్షణలో ఇంటి వద్దే చికిత్స పొందుతున్నారు. అయితే, బాలిక మృతిచెందిన విషయాన్ని అధికారులు నిర్ధారించడం లేదు. చికిత్స పొందుతున్న ఏడుగురిలో కొందరు కేజీహెచ్, మరికొందరు ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రిలో ఉన్నట్టు చెబుతున్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు తెలిసింది. తీవ్రమైన విరేచనాలు, వాంతులు కారణంగా డీహైడ్రేట్ అయిన అనిత (35), వంశీ (23) అనేవారికి కిడ్నీ సమస్య రావడంతో కేజీహెచ్‌లో డయాలసిస్ చేయిస్తున్నారు. మిగిలిన వారంతా కోలుకుంటున్నారని, ఇప్పటికే ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశామని ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు.

తాగునీరు కలుషితం కావడంతో..

జీవీఎంసీ తాగునీటి కొళాయి వద్దే మురుగు కాలువ ఉంది. తాగునీటిలో కాలువ నీరు కలవడం వల్లే డయేరియా వ్యాప్తి చెందిందని స్థానికులు చెబుతున్నారు. కొళాయి వద్ద కొద్దిరోజుల కిందట గోడ నిర్మాణం చేపట్టారు. ఆ సమయంలోనే పైప్‌లైన్‌లోకి మురుగునీరు చేరి ఉంటుందని చెబుతున్నారు. ఆరోగ్య శాఖ అధికారులు నీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిమిత్తం పంపించారు. ఆ కొళాయి సమీపంలో గల

... మిగతా 6వ పేజీలో

ఏ ఎండకు ఆ గొడుగు!

ఊసరవెల్లిల్లా రంగులు మార్చుతున్న కార్పొరేటర్లు

» స్వప్రయోజనాల కోసం పార్టీల మార్పు
» తాజాగా ఇద్దరు టీడీపీలో చేరిక
» అక్రమంగా నిర్మించిన భవనాన్ని కాపాడుకోవడానికి 23వ వార్డు కార్పొరేటర్ గుడ్ల విజయసాయి దంపతులు, స్టాండింగ్ కౌన్సిల్ పదవి కాపాడుకోవడానికి 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య అధికార పార్టీలో చేరారనే విమర్శలు



కార్పొరేటర్లకు కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి (ఫైల్)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో కొంతమంది కార్పొరేటర్ల వ్యవహారశైలిపై రాజకీయ వర్గాలతో పాటు ప్రజల్లో విస్తృత చర్చ జరుగుతోంది. వ్యక్తిగతంగా లబ్ధి కలుగుతుందని భావిస్తే చాలు...తమను ఎన్నుకున్న ఓటర్లు ఏమనుకున్నా పర్వాలేదన్నట్టుగా కొందరు వ్యవహరిస్తున్నారు. జీవీఎంసీ ఎన్నికల్లో టీడీపీ తరపున గెలిచినవారు తమ వ్యక్తిగత ప్రయోజనం కోసం వార్డు ప్రజల మనోభావాలను పట్టించుకోకుండా నాడు అధికారంలో ఉన్న వైసీపీ మద్దతుదారులుగా వ్యవహరించారు. తాజాగా రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో ఇండిపెండెంట్లుగా గెలిచి వైసీపీలో చేరినవారు, వైసీపీ తరపున ఎన్నికైన కొందరు టీడీపీ, జనసేనల్లో చేరేందుకు పోటీపడుతున్నారు.

తాజాగా 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, 23వ వార్డు కార్పొరేటర్ గుడ్ల విజయసాయి వైసీపీని వీడి టీడీపీలో చేరడంపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. వారి చేరికలను ఆయా వార్డుల టీడీపీ నేతలు తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ నాయకులు మాత్రం పట్టించుకోలేదు. 15వ వార్డు కార్పొరేటర్ భర్త అప్పారి గిరిబాబు ప్రస్తుతం జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ (న్యాయవాది)గా ఉన్నారు. ఏడాది కాలానికి మొదట్లో ఆయన్ను నియమించినప్పటికీ తర్వాత మరో ఏడాది పొడిగించారు. తాజాగా ఆ కాలపరిమితి ముగుస్తుండడంతో మరోసారి పొడిగింపు కోసం ఆయన భార్య టీడీపీలో చేరారని 15వ వార్డు 'దేశం' నాయకులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి శ్రీవిద్య టీడీపీ మద్దతుతోనే కార్పొరేషన్ ఎన్నికల్లో గెలిచినప్పటికీ తర్వాత స్వప్రయోజనాల కోసం వైసీపీలో చేరారు. వైసీపీలో చేరిన తర్వాత శ్రీవిద్యకు స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా చోటుదక్కగా, ఆమె భర్త గిరిబాబు స్టాండింగ్ కౌన్సిల్ పదవి లభించిందని వివరిస్తున్నారు. స్టాండింగ్ కౌన్సిల్‌గా కొనసాగింపు పొందవచ్చుననే భావనతోనే ఇప్పుడు టీడీపీలో చేరారని విశ్లేషిస్తున్నారు. మరోవైపు 23వ వార్డు కార్పొరేటర్ గుడ్ల విజయసాయి భర్త సత్యారెడ్డి జీవీఎంసీ ఎన్నికలకు ముందు వరకూ టీడీపీలోనే ఉండేవారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉండడంతో జీవీఎంసీ ఎన్నికలకు ముందు వైసీపీలో

... మిగతా 6వ పేజీలో

పద్ధతి మార్చుకోండి

» ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులకు జీవీఎంసీ కమిషనర్ హెచ్చరిక
» అవినీతికి అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక దృష్టి
» క్షేత్రస్థాయిలో ఆకస్మిక పర్యటనలు
» మరోవైపు జోన్లవారీగా సమీక్షలు నిర్వహించాలని నిర్ణయం
» విధినిర్వహణలో నిర్లక్ష్యంవహిస్తే చర్యలు తప్పవని హెచ్చరికలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆదాయానికి మించి ఆస్తులు కూడగట్టారనే అభియోగంపై జోన్-2 కమిషనర్ పి.సింహాచలాన్ని ఏసీబీ అధికారులు అరెస్టు చేయడం, జోన్-8లో అక్రమ భవనానికి ప్లానింగ్ సెక్రటరీ సహకరించారనే ఆరోపణలు రావడం జీవీఎంసీ ప్రతిష్ఠకు మచ్చగా మారింది. ఈ నేపథ్యంలో ఉద్యోగులు, సిబ్బంది అవినీతికి అడ్డుకట్ట వేస్తేనే జీవీఎంసీని గాడిలో పెట్టలేమని గుర్తించిన కమిషనర్ పి.సంపత్‌కుమార్ అందుకోసం కార్యాచరణ రూపొందించారు. ఇప్పటికే క్షేత్రస్థాయి పర్యటనలతో నగరంపై ఒక అవగాహన ఏర్పరచుకున్న కమిషనర్ జోన్‌ల వారీగా ప్రతి అధికారి, ఉద్యోగితో నేరుగా సమావేశం కావాలని నిర్ణయించుకున్నారు. జోన్‌ల వారీగా సమస్యలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందుతున్న ఫిర్యాదుల ఆధారంగా ఒక నివేదిక తయారుచేసుకున్నారు. రోజుకొక జోన్ చొప్పున సమీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందులో భాగంగానే బుధవారం జోన్-8 (గాజువాక)లో సమీక్ష నిర్వహించిన కమిషనర్, గురువారం జోన్-4 (సూర్యాబాగ్)లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగుల పని తీరు, విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతిపై ప్రధానంగా కమిషనర్ ప్రస్తావించినట్టు తెలిసింది. ప్రతి ఉద్యోగి ఏం చేస్తున్నారు, ఎలా పనిచేస్తున్నారునేదానిపై తనకు సమాచారం ఉందని పేర్కొంటూ...

... మిగతా 6వ పేజీలో

2,12,662

...ఇదీ గత నెల రోజుల్లో దీపం-2 కింద ఉచిత సిలిండర్ బుక్ చేసుకున్న వారి సంఖ్య

» 1,94,403 మందికి సబ్సిడీ విడుదల
» 1.57 లక్షలమంది ఖాతాలకు రూ.12.54 కోట్లు జమ



విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపం-2 పథకానికి అనూహ్య స్పందన లభిస్తోంది. జిల్లాలో గడచిన నెల రోజుల్లో 2,12,662 మంది గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోగా, వారిలో 1,94,403 మంది లబ్ధిదారులకు రూ.15,44,15,045 మంజూరయ్యాయి. ఇప్పటివరకూ 1,57,999 మంది ఖాతాలకు రూ.12,54,510,30 జమ అయ్యాయి. దీపం-2 పథకం కింద బియ్యం కార్డుదారులు ఉచిత గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకునేందుకు గత నెల 29వ తేదీ నుంచి ప్రభుత్వం అవకాశం కల్పించింది. గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్న 48 గంటల్లో డెలివరీ అవుతుంది. అక్కడ నుంచి 48 గంటల్లో లబ్ధిదారుని ఖాతాకు రూ.807 జమ అవుతున్నాయి.

జిల్లాలో 5.29 లక్షల మంది బియ్యం కార్డులు ఉండగా అందులో 3.66 లక్షల కార్డుదారులు ఉచిత గ్యాస్ సిలిండర్‌కు అర్హులుగా పౌర సరఫరాల శాఖ గుర్తించింది. కొందరు బియ్యం కార్డుదారులకు రెండు అంతకంటే ఎక్కువ గ్యాస్ కనెక్షన్లు ఉండగా, మరికొందరు ఉజ్వల పథకం కింద గ్యాస్ సిలిండర్ తీసుకుంటున్నారు. వారిని మినహాయించగా 3.66 లక్షల మంది ఉచిత సిలిండర్లు తీసుకునేందుకు అర్హులుగా తేల్చారు. వీరిలో బుధవారం వరకు 2,12,662 మంది సిలిండర్ బుక్ చేసుకోగా 1,94,403 మందికి సబ్సిడీ విడుదలైందని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి భాస్కరరావు

... మిగతా 6వ పేజీలో

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కొమ్మాది, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాది విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ సేవానగర్ ఫీడర్ నిర్వహణ పనులు దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకూ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈఈ నరేశ్ తెలిపారు. గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. కొమ్మాది జంక్షన్, శ్రీనివాసానగర్, సాయిరాం కాలనీ, జీసీసీ లేఅవుట్, టీచర్స్ లేఅవుట్, అమరావతి కాలనీ, సూర్యా పేపర్, డ్రైవర్స్ కాలనీ, వెంకట్‌నగర్, ఏసీ కాలనీ, మాస్టర్ స్కూల్ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

పద్మనాభంలో...

పద్మనాభం రూరల్ : పద్మనాభం, బోని, గంధవరం,శిర్లపాలెం ఫీడర్ల నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. పద్మనాభం, ఇసకలపాలెం, మద్ది, విలాస్‌ఖాన్‌పాలెం,అనంతవరం, పెంట, కొవ్వాడ, విజయరాంపురం, గంధవరం, కృష్ణాపురం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

ప్రహరీ నిర్మాణానికి తీర్మానం

తగరపువలస,నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని పాఠశాల నిర్వహణ కమిటీ తీర్మానించింది. గురువారం పాఠశాల ఆవరణలో విద్యా కమిటీ చైర్మన్ కె. భాగ్యలక్ష్మి అధ్యక్షతన తల్లిదండ్రుల సమావేశం జరిగింది.

నేడు అవయవ దానంపై అవగాహన ర్యాలీ

భీమునిపట్నం,నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అవయవ దానంపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు బెస్ట్ ఫ్రెండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ సంతోష్‌రాజా తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

సోలార్ విద్యుత్ వినియోగం పెరగాలి

- దీనిపై విస్తృత ప్రచారం అవసరం
- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆనందపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సోలార్ విద్యుత్ వినియోగంపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా ప్రతి ఒక్క వినియోగదారునికి సోలార్ విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం యూనిట్ కరెంటు రేటు పెరుగుతుందన్నందున సౌర విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకాన్ని అమలు చేస్తున్నాయని చెప్పారు. దీనివల్ల వినియోగదారులకు తక్కువ ధరకే విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. ఈ పథకంపై అధికారులు ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు.జిల్లాలో భీమిలి నియోజకవర్గంలో ఆరు గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని చెప్పారు. ఆనందపురం, గంభీరం, చిప్పాడ, రెడ్డిపల్లి, వెల్లంకి, రాజుల తాళ్లవలసలో విద్యుత్ శాఖాధికారులు, జీవీఎంసీ అధికారులు పర్యటించి, పథకాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజనపై పెద్ద ఎత్తున సదస్సులు ఏర్పాటు చేసి, సౌర విద్యుత్ గురించి అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. పంచాయతీలు పూర్తిగా సోలార్ విద్యుత్ వాడితే కేంద్రం రూ. కోటి వరకూ నజరానా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సంగీత్ మాధుర్, విద్యుత్ శాఖాధికారులు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

అనంత పద్మనాభుని దీపోత్సవానికి సర్వం సిద్ధం

ఆలయ ఈఓ నానాజీబాబు

పద్మనాభం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో అనంత పద్మనాభుడి దీపోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఈఓ నానాజీబాబు చెప్పారు. కుంతీమాధవస్వామి ఆలయ ఆవరణలోని సామాజిక భవనంలో గురువారం నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవానికి అవసరమైన ప్రమిదలు, ఒత్తులు, నూనెను ఇప్పటికే సిద్ధం చేశామన్నారు. మెట్ల మార్గాన్ని, ఆలయ పరిసరాలను శుభ్రం చేశామని చెప్పారు. కొండపై ఆలయ పునర్నిర్మాణ దశలో ఉండడంతో భక్తులకు స్వామి దర్శనం కోసం కొండపై ప్రత్యేకంగా మండపం ఏర్పాటు చేసి ఉత్సవ విగ్రహాలను నిలుపుతామని తెలిపారు. భక్తులకు మంచినీటి సదుపాయంతో పాటు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ స్వామిని దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నగేశ్‌కుమార్, తెలుగు యువత అధ్యక్షుడు సత్యనారాయణ, స్థానిక నాయకులు పద్దు, ఎర్నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ నానాజీబాబు

ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మధురవాడ నార్త్ జోన్ ఏసీపీ ఎస్. అప్పలరాజు చెప్పారు. గురువారం ఆయన స్థానిక పోలీసు స్టేషన్ వద్ద నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. సీఐలు, ఎస్‌ఐలు సహా 600 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉత్సవానికి చేరుకునే మార్గాల్లో మధ్యాహ్నం 1 తరువాత భారీ వాహనాలను దారి మళ్లిస్తామన్నారు. చిన్నాపురం జంక్షన్, నీలకుండీలు జంక్షన్, మహారాజ్‌పేట జంక్షన్ మీదుగా భక్తులు ఉత్సవానికి వస్తారన్నారు. చిన్నాపురం నుంచి వచ్చేవారిని అర్చకునిపాలెం వద్ద, మహారాజ్‌పేట జంక్షన్ నుంచి వచ్చేవారిని స్ప్రింగ్ ఫీల్డు పాఠశాల వద్ద, నీలకుండీలు నుంచి వచ్చేవారిని చెరకు కాటా వద్ద నిలిపివేస్తామన్నారు. అక్కడి నుంచి ఆర్టీసీ అధికారులు షటిల్ సర్వీసులను నడిపి కొంత దూరం తీసుకువెళ్తారన్నారు. అక్కడి నుంచి భక్తులు ఉత్సవ స్థలానికి చేరుకోవాలన్నారు.అన్ని శాఖల అధికారులతో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామన్నారు. మెట్లకు వెళ్లే దారిలో దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు ఆనందరావు, సీఐ సీహెచ్ శ్రీధర్, ఆరోగ్యశాఖ ఏఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలాలు

చిన్నాపురం జంక్షన్ నుంచి వచ్చే కార్లు, బైక్‌లకు జెడ్పీ అతిథి గృహం, మామిడి తోట, అర్చకునిపాలెం వద్ద పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయగా, మహారాజ్‌పేట నుంచి వచ్చే వారికి తహసీల్దారు కార్యాలయం, పౌర సరఫరాల శాఖ గిడ్డంగి, స్ప్రింగ్ ఫీల్డు పాఠశాల వద్ద, నీలకుండీలు నుంచి వచ్చే వారికి పద్మనాభం వంతెన, గరానా సత్యనారాయణ ఖాళీ స్థలం, చెరకు కాటా వద్ద పార్కింగ్ స్థలాలు కేటాయించారు.

జోన్-2 జడ్సీగా ఫణిరామ్

కొమ్మాది, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోన్-2 ఇన్‌చార్జి కమిషనర్‌గా ఎంపీడీ ఫణిరామ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ జడ్సీగా పనిచేసిన పొందూరు సింహాచలంను ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో డీపీఓగా పనిచేస్తున్న ఫణిరామ్‌ను ఇన్‌చార్జి జడ్సీగా నియమించారు. నూతన జడ్సీకి జోనల్ కార్యాలయంలోని పలు విభాగాల అధికారులు ఘన స్వాగతం పలికారు.

7న మెగా పేరెంట్స్ డే : డిప్యూటీ డీఈఓ

భీమునిపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం వచ్చేనెల 7న నిర్వహించనున్న మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని డిప్యూటీ డీఈఓ సోమేశ్వరరావు కోరారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెగా పేరెంట్స్ డే రోజున విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డును తల్లిదండ్రుల సమక్షంలో అందజేయాలన్నారు. తల్లిదండ్రులకు రంగోళి, టగ్ ఆఫ్ వార్, వంటి క్రీడలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. అలాగే ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో హనుమంతరావు, ఎంఈవోలు ఎం. శివరాణి, జయప్రద, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీస్తున్న ఫార్మా కంపెనీలు

... 5వ పేజీ తరువాయి

కంపెనీలకు వెళ్లాల్సిందిగా ఆదేశిస్తున్నారు. దీనివల్ల తనిఖీలు సరిగ్గా జరగడం లేదు. రాష్ట్రంలో అత్యధిక ఫార్మా కంపెనీలు ఉన్నది ఇక్కడే. అధికారులకు అధిక ఆదాయం ఇచ్చే జిల్లా కూడా ఇదే. దాంతో ఆ శాఖలోని పెద్దలు వారికి అనుకూలంగా ఉండేవారిని ఇక్కడ పెట్టుకొని తూతూమంత్రపు తనిఖీలతో జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విచిత్రంగా ఎల్‌జీ పాలిమర్స్ నుంచి ఠాగూర్ కంపెనీ వరకు పెద్ద ప్రమాదాలు జరిగిన కంపెనీలన్నీ కొద్దిమంది అధికారులు తనిఖీ చేసినవే కావడం గమనార్హం. వారికి తనిఖీ చేసే సామర్థ్యం లేదా?, జేబులు నింపుకొని మిన్నకుంటున్నారా?...అనేది ప్రభుత్వం తేల్చాల్సి ఉంది. ఇటీవల ఒక అధికారిని దుష్ప్రవర్తన కారణంగా సస్పెండ్ చేశారు. ఇప్పుడు మూడు జిల్లాలకు కలిపి పరిశ్రమలను తనిఖీ చేసేందుకు ఇన్‌స్పెక్టర్ ఒక్కరే ఉన్నారు. అన్నీ తమ చేతుల్లోనే ఉండాలని ఇలా చేస్తున్నారా?...అనే అనుమానాలు కూడా కలుగుతున్నాయి.

సూచనలు బేఖాతరు

ఎసెన్షియా ప్రమాదం తరువాత విజయవాడ నుంచి పరిశ్రమలు, అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు వచ్చారు. అధికారులు, కార్మికులతో మాట్లాడారు. ప్రమాదాలు జరగకుండా పలు సూచనలు చేశారు. వాటిని అమలు చేయాల్సిందిగా సూచించారు. అలాగే గుర్తించిన లోపాలు కూడా వెల్లడించారు.

సేఫ్టీ ఆడిట్ ఏమైంది..?

ఎసెన్షియా ప్రమాదం తరువాత వారం రోజుల్లో ప్రతి కంపెనీ కూడా సేఫ్టీ ఆడిట్ నిర్వహించి నివేదిక సమర్పించాలని విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు ఆదేశించారు. ఇదంతా ఆ ఒక్కరోజు హడావుడిగానే మిగిలిపోయింది. ఎవరు ఆడిట్ చేశారు ?, ఎవరు చేయలేదు ?,కారణాలు ఏమిటి?...అనేది సమీక్షించలేదు.

ఏ ఎండకు ఆ గొడుగు!

... 5వ పేజీ తరువాయి

చేరారు. తన భార్యకు టిక్కెట్ సంపాదించుకున్నారు. అధికార పార్టీ కార్పొరేటర్ భర్తననే అధికారాన్ని ఉపయోగించుకుని కృష్ణా కాలేజీ వెనుకవైపు 800 గజాల ప్రభుత్వ స్థలాన్ని తప్పుడుపత్రాలతో ఆక్రమించుకున్నారనే అభియోగం సత్యారెడ్డిపై ఉంది. ఆ భూమిలో రెండు వ్యక్తిగత ఇళ్ల నిర్మాణానికి జీవీఎంసీ అధికారులపై ఒత్తిడి తెచ్చి ప్లాన్ సంపాదించి, అందులో ఏకంగా భారీ వాణిజ్య భవనం నిర్మించేశారు. ఆ భవనంలో పాఠశాల ఏర్పాటుచేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో ఆ భూమికి సంబంధించిన వివాదం తెరపైకి వచ్చింది. ప్లాన్‌ను ఉల్లంఘించారనే అభియోగంపై ఇప్పటికే జీవీఎంసీ అధికారులు నోటీసులు జారీచేశారు. రెవెన్యూ శాఖ అధికారులు కూడా ప్రభుత్వ భూమికి తప్పుడు పత్రాలు సృష్టించారనే ఆరోపణలపై విచారణ ప్రారంభించారు. దీంతో అక్రమ భవనాన్ని కాపాడుకునేందుకు సత్యారెడ్డి ఇప్పుడు టీడీపీలో చేరారనే విమర్శలు రెండు పార్టీల నుంచి వినిపిస్తున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సత్యారెడ్డి వార్డులో టీడీపీ నాయకులు, కార్యకర్తలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేశారు. సాధారణ ఎన్నికలకు ముందు ఎంవీపీ కాలనీలో జరిగిన సిద్ధం సభలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అలాంటి వ్యక్తి తన వ్యక్తిగత ప్రయోజనం కోసం టీడీపీలో చేరేందుకు యత్నిస్తుంటే 23వ వార్డులోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తీవ్రస్థాయిలో వ్యతిరేకించారు. తమను వేధించిన వ్యక్తిని పార్టీలో చేర్చుకోవద్దని నియోజకవర్గ నేతలకు మొరపెట్టుకున్నారు. అయినప్పటికీ సత్యారెడ్డికి బాగా ఆప్తుడైన ఎమ్మెల్యే వెలగపూడి అనుచరుడు ఒకరు ఒత్తిడి చేయడంతో పార్టీలో చేర్చుకున్నారనే ప్రచారం జరుగుతోంది.

జబ్బరు తోటలో అతిసార

... 5వ పేజీ తరువాయి

ఇళ్లకు చెందినవారే డయేరియా బారినపడ్డారు.

ఈ లక్షణాలతో ఇబ్బందులు

గడిచిన ఐదు రోజుల నుంచి ఆ ప్రాంతానికి చెందిన పలువురు విరోచనాలు, వాంతులతో ఇబ్బంది పడుతున్నారు. రోజురోజుకూ బాధితుల సంఖ్య పెరగడంతో స్థానికుల్లో ఆందోళన మొదలైంది. ఆరోగ్యశాఖ సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారాన్ని ఇవ్వడంతో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఇబ్బందిగా ఉన్న వారిని ఆస్పత్రుల్లో చేర్పిన అధికారులు వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. శానిటేషన్ చర్యలను జీవీఎంసీ సిబ్బంది చేపట్టారు.

పద్ధతి మార్చుకోండి

... 5వ పేజీ తరువాయి

కొంతమంది పనితీరు మార్చుకోనిపక్షంలో కఠిన చర్యలకు గురికాకతప్పదని హెచ్చరించినట్టు సమాచారం. టౌన్‌ప్లానింగ్ విభాగంలో వార్డు ప్లానింగ్ కార్యదర్శులే అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నట్టు తనకు ఫిర్యాదులు అందుతున్నాయని, ఇకపై అలాంటి వాటికి స్వస్తి పలకాలని కమిషనర్ సూచించినట్టు తెలిసింది. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ చెప్పినట్టు సమీక్షకు హాజరైన అధికారులు తెలిపారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి కంది పప్పు, బెల్లం వితరణ

సింహాచలం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకంలో వినియోగించాలని కోరుతూ ప్రముఖ తెలుగు సినీ నిర్మాత కొర్రపాటి సాయి 350 కిలోల కంది పప్పు, 250 కిలోల బెల్లం వితరణగా అందజేశారు. ఈమేరకు దేవాలయం అధికారులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఠాగూర్ ఫార్మా ప్రమాదంలో మరొకరి మృతి

పరవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో గల ఫార్మాసిటీలోని ఠాగూర్ లేబొరేటరీస్‌లో మంగళవారం సాయంత్రం విష వాయువులు లీకైన ఘటనలో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న సీహెచ్ వీరశేఖర్ (36) అనే ఉద్యోగి గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. దీంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య రెండుకు చేరింది. కాగా వీరశేఖర్ రెండేళ్లుగా పరిశ్రమలో వేర్‌హౌస్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం గుంతనవానిపాలేనికి చెందిన వీరశేఖర్‌కు భార్య సూర్యకళ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అగనంపూడి సమీపంలో గల ఫార్మా పునరావాస కాలనీలో నివాసం ఉండేవారు. కాగా విశాఖ కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని శుక్రవారం కుటుంబసభ్యులకు అప్పగిస్తామని పరవాడ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. ఇదిలావుంటే ఇదే ప్రమాదంలో బుధవారం మృతిచెందిన అమిత్‌భాగ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి గురువారం కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పర్యవేక్షణలో సీఐ మల్లికార్జునరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఠాగూర్ ఫార్మాలో మరో 18 మందికి అస్వస్థత

ఠాగూర్ ఫార్మాలో విష వాయువుల లీకైన ఘటనలో అస్వస్థతకు గురైన మరో 18 మంది ఉద్యోగులు గురువారం విశాఖ నగరంలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరారు. వీరికి అత్యవసర చికిత్స అందిస్తున్నట్టు సీఐ జి.మల్లికార్జునరావు తెలిపారు. మంగళవారం జరిగిన విషవాయువుల లీకేజీ ఘటనలో తొలుత 11 మంది ఉద్యోగులు అస్వస్థతకు గురికాగా ఆస్పత్రుల్లో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం ఒకరు, గురువారం మరొకరు మృతిచెందారు. ఆ తొమ్మిది మందితో పాటు గురువారం చేరిన మరో 18 మంది కలిపి మొత్తం 27 మంది చికిత్స పొందుతున్నారు. అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని సీఐ తెలిపారు.

వ్యర్థాలను శుద్ధి చేసి వినియోగించే సాంకేతికత రావాలి

- వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై గీతం అంతర్జాతీయ సదస్సులో నిపుణులు

సాగర్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యర్థాలను శుద్ధి చేసి తిరిగి వినియోగించే సాంకేతిక పరిజ్ఞానాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేయాలని నిపుణులు పిలుపునిచ్చారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ సంస్థ నిర్వహిస్తున్న 14వ అంతర్జాతీయ సదస్సుకు గురువారం ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య మాట్లాడుతూ వ్యర్థాల నుంచి సంపదను సృష్టించే సర్క్యులర్ ఎకానమీపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిపెట్టాయన్నారు. తీర ప్రాంతాలలో సముద్ర జలాలు కలుషితమై మత్స్య దిగుబడులు తగ్గిపోతున్నాయని, వ్యర్థాలను సమర్థంగా శుద్ధి చేసి ప్రయోజనకరంగా మార్చే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తే ఇలాంటి సమస్యలు తొలగిపోతాయన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ పి.కృష్ణకాంత్ మాట్లాడుతూ నీతిఆయోగ్ జాతీయ ప్రణాళికలో సర్క్యులర్ ఎకానమీకి మేథో సహకారం అందిస్తున్నామన్నారు. గీతం ఇన్‌చార్జి వీసీ వై.గౌతమ్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకునే ప్రణాళికలు అవసరమన్నారు. సదస్సు చైర్మన్ ప్రొఫెసర్ సాధన్ కె.ఘోష్, రాజాపణిపప్పు, షర్ఫెకమెల్ అమీన్, ప్రసాద్, జ్ఞానసుందరం, తోరణి తదితరులు ప్రసంగించారు. వ్యర్థాల నిర్వహణపై పరిశోధన చేస్తున్న డాక్టర్ భాను మతిదాస్‌కు లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు అందించారు. అనంతరం సదస్సుకు సంబంధించిన సావనీర్‌ను ముఖ్య అతిథులు, నిపుణులు విడుదల చేశారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య, నిపుణులు

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ సంపెంగలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు.అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున సిరి సంపెంగలతో పూజ చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

భీమిలి తీరంలో ఎగిసిపడుతున్న అలలు

భీమునిపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ నేపథ్యంలో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. కెరటాలు పెద్ద ఎత్తున ఎగిసిపడుతున్నాయి. సముద్రం నుంచి చల్లని గాలులు వీస్తుండడంతో పట్టణవాసులు ఇళ్లకే పరిమితమయ్యారు.మత్స్యకారులు వేటకు వెళ్లకుండా, పడవలను సురక్షిత ప్రదేశాల్లో భద్రపరుచుకున్నారు. బీచ్‌కు వచ్చే సందర్శకులు కూడా తగ్గారు.



పార్కింగ్ సమస్య పరిష్కారానికి చర్యలు

సాగర్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్ దక్షిణ రహదారిని డీఎస్పీ అన్నెపు నరసింహమూర్తితో కలిసి జిల్లా పర్యాటక శాఖాధికారి జ్ఞానవేణి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుషికొండ బీచ్‌లో పార్కింగ్ సమస్య పరిష్కారానికి దక్షిణం వైపు రహదారికి ఆనుకుని ఉన్న స్థలాన్ని కేటాయించనున్నట్టు తెలిపారు. అలాగే కొండ వెనుక వైపు ఫెన్సింగ్, లైటింగ్ మెరుగుపరిచే విషయమై జీవీఎంసీ అధికారులతో చర్చించనున్నామన్నారు.దక్షిణం వైపు రహదారిలో ఉన్న వ్యూపాయింట్ వద్దకు సందర్శకులను అనుమతించే విషయం కూడా పరిశీలిస్తున్నట్టు చెప్పారు. వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై సందర్శకుల నుంచి ఫిర్యాదులు అందాయని, వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



డీఎస్పీ అన్నెపు నరసింహమూర్తితో చర్చిస్తున్న పర్యాటక శాఖాధికారి జ్ఞానవేణి

ఘనంగా వేద పండిత సదస్యం

సింహాచలం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహుడు భక్తసులభుడని కనకమహాలక్ష్మీ దేవస్థానానికి చెందిన వేద పండితుడు ముష్టి వెంకటేశ్వర ఘనాపాఠి అన్నారు. దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం స్వామివారి ఆలయ కల్యాణ మండపంలో వేద పండిత సదస్యం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాణాల్లోని ప్రహ్లాదుని రక్షణ, ఇతర అనేక ఉదంతాలను వివరించారు. కాగా ఈ కార్యక్రమానికి పలు ప్రాంతాల నుంచి 50 మంది వేద పండితులు హాజరై యజుర్వేద, రుగ్వేద, సామవేద, అథర్వ వేదాలను రెండు గంటల పాటు పారాయణ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐవీ రమణాచార్యులు సారథ్యం వహించగా, పాల్గొన్న పండితులను ఏఈఓ ఆనందకుమార్, పర్యవేక్షణాధికారి ప్రసాద్ ఘనంగా సత్కరించారు.

గంభీరంలో వైభవంగా లక్ష దీపోత్సవం

ఆనందపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గంభీరం పంచాయతీ ఐఐఎం రోడ్డులో ఉన్న హరేకృష్ణ వైకుంఠం ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవం గురువారం రాత్రి వైభవంగా జరిగింది. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఆకాశ దీపం వెలిగించి, దీపోత్సవాన్ని ప్రారంభించారు. గంభీరంతో పాటు పలు గ్రామాల మహిళలు ఉత్సవంలో భాగస్వాములయ్యారు.



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పోలీసుల చేతివాటం

... 5వ పేజీ తరువాయి

సిద్ధపడుతుంటారు. ఇలాంటివారి బలహీనతను అవకాశంగా తీసుకుని కొంత మంది పోలీసులు జేబులు నింపుకుంటున్నారు. పట్టుబడిన వ్యక్తులను కోర్టు పేరు చెప్పి... మరింత ఆందోళనకు గురిచేసి భారీగా డబ్బులు గుంజేసి విడిచిపెట్టేస్తున్నారు. ఒకవేళ కేసు నమోదుచేయక తప్పని పరిస్థితి ఏర్పడితే మాత్రం ఎంతో కొంత జరిమానా అధికారికంగా కట్టినట్టు చూపించి, వారిని కోర్టుకు తరలించకుండా తప్పించేస్తున్నారు. నగరంలో చాలాచోట్ల సిబ్బంది ఇదే ధోరణి అవలంబిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సిబ్బందికి సంబంధిత ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ రైటర్లు, ఎస్‌ఐ సహకారం ఉండడంతో గుట్టుచప్పుడు కాకుండానే వసూళ్లపర్వం సాగిపోతోంది. ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో పట్టుబడిన వ్యక్తి నుంచి డబ్బులు తీసుకుని స్టేషన్‌కు తరలించకుండా తప్పించేయడంపై సీపీ శంఖబ్రత బాగ్చీకి గుర్తుతెలియని వ్యక్తులు ఫిర్యాదుచేశారు. దీనిపై ఆయన విచారణకు ఆదేశించారు.వాస్తవమేనని తేలడంతో త్రీటౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐగా అటాచ్‌మెంట్‌పై పనిచేస్తున్న ప్రభాకరావుతోపాటు స్టేషన్ రైటర్‌ను సీపీ సస్పెండ్ చేశారు. కొన్నాళ్ల కిందట బీచ్‌రోడ్డులో ట్రాఫిక్ ఎస్‌ఐ, హోంగార్డు కలిసి...డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తి నుంచి డబ్బులు ఫోన్‌పే చేయించుకున్న విషయం వెలుగులోకి రావడంతో సీపీ సస్పెన్షన్ వేటు వేశారు. ఫోర్త్ టౌన్, టూటౌన్ స్టేషన్ల పరిధిలో కూడా గతంలో ఇలాంటి ఉదంతాలు వెలుగులోకి రావడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో అనధికార వసూళ్లు కొనసాగు తున్నప్పటికీ ఉన్నతాధికారులు సీరియస్‌గా దృష్టిసారించడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటున్నారే తప్పితే, ప్రత్యేకంగా సిబ్బంది పనితీరుపై నిఘా పెట్టడం లేదు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు జరుగుతున్న తీరుతెన్నులతోపాటు సంబంధిత సిబ్బందిపైనా సీపీ ప్రత్యేక నిఘా పెట్టాలని కోరుతున్నారు.

2,12,662

... 5వ పేజీ తరువాయి

తెలిపారు. వీరిలో 1,57,999 మందికి రూ.12,54,55,030 జమ అయ్యాయన్నారు. కాగా జిల్లాలో ఉచిత గ్యాస్ సిలిండర్ సబ్సిడీ పొందగోరు బియ్యం కార్డుదారులు తమ బ్యాంకు ఖాతాలను పునరుద్ధరించుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ కోరారు. సిలిండర్ బుక్ చేసుకునే సమయంలో వినియోగదారుడి ఆధార్ నంబరుకు, బ్యాంకు ఖాతా నంబరు/ఫోన్ నంబర్‌కు అనుసంధానం కాలేదని, ఇంకా బ్యాంకు ఖాతాకు ఈకేవైసీ చేయలేదని సమాచారం వస్తోందన్నారు. వినియోగదారులు గతంలో ఖాతా ఉన్న బ్యాంకుకు వెళ్లి ఆధార్ నంబరు, ఫోన్ నంబరుతో అనుసంధానం చేసుకోవాలన్నారు. ఒకవేళ బ్యాంకు ఖాతాలు మూసివేస్తే వాటిని యాక్టివ్ చేసుకునేలా సరైన పత్రాలను బ్యాంకు సిబ్బందికి అందజేయాలని కోరారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

భీమునిపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : టీడీపీలో చేరడానికి యువత, మహిళలు ఉత్సాహం చూపిస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. గురువారం ఎగువపేటలో ఆయన సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే గంటా పిలుపుతో మూడో వార్డులో సభ్యత్వ నమోదును విస్తృతంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు పైడిపల్లి నరసింగరావు, మట్టా కొండ, మూగి రాజు, కిరణ్, వాసుపల్లి వంశీ, తదితరులు పాల్గొన్నారు.



ఎగువపేటలో సభ్యత్వ నమోదు చేపడుతున్న నూకరాజు

నిర్లక్ష్యానికి బలవుతున్న నిండు ప్రాణాలు!

- మితిమీరిన వేగమే పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు కారణం
- నిబంధనలకు తిలోదకాలిచ్చి తనువు చాలిస్తున్న వాహనదారులు
- శోకసంద్రంలో మునుగుతున్న కుటుంబ సభ్యులు



స్టీల్‌ప్లాంట్ మార్గంలో గతంలో జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం. (ఇన్‌సెట్లో) మరో ప్రమాదంలో దెబ్బతిన్న బైక్ (ఫైల్ ఫొటోలు)

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలిగొంటుంది. వాహనం నడిపినప్పుడు ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ప్రాణాలు గాలిలో కలిసిపోయినట్టే. ఇటీవల కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే.. అతి వేగంగా వాహనాలను నడపడం వల్లే జరిగినట్టు తెలుస్తోంది. అధిక సీసీ సామర్థ్యం కలిగిన వాహనాలను వేగంగా నడపడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అతి వేగంగా వాహనం నడుపుతూ దానిని కంట్రోల్ చేయలేక అదుపు తప్పి అత్యధికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. బుధవారం స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులతో పాటు, ఓ కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందాడు. గత ఏడాది స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్-10 మలుపు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అలాగే డిపాల్ స్కూల్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఫార్మాసిటీకి చెందిన ఓ బస్సు ఢీకొనడంతో ఓ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఉక్కు అధికారి కుమారుడు మద్యం సేవించి కారును వేగంగా నడిపి ద్విచక్ర వాహనదారుడిని ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. అదేవిధంగా స్టీల్‌ప్లాంట్ కళాశాల జంక్షన్ వద్ద ఇద్దరు యువకులు వేగంగా వాహనం నడిపి అదుపు చేయలేక ఓ చెట్టును ఢీకొనడంతో ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఇలా అతి వేగంగా వాహనాలు నడపడం వల్ల నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీసులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా వేగంగా వాహనాలు నడపడం వల్ల జరుగుతున్న ప్రమాదాలకు కళ్లెం వేయలేకపోతున్నారు. అతి వేగంగా వాహనాలను నడపడం వల్ల, రోడ్డు నిబంధనలను అతిక్రమించడం వల్ల చోటుచేసుకుంటున్న దుష్ఫలితాల గురించి పోలీసులు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నా అత్యధికులు వాటి గురించి పట్టించుకోకుండా ప్రమాదాల బారినపడుతూ ప్రాణాలు కోల్పోతున్నారు.. తమ కుటుంబ సభ్యులకు తీరని శోకాన్ని మిగులుస్తున్నారు.

నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణం

-కె.వెంకటరావు, స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ సీఐ



యువత వాహనాలను అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడపటం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదాల నివారణకు తాము ఎక్కడపడితే అక్కడ హెచ్చరిక బోర్డులతో పాటు సిబ్బందిని కూడా నియమించాం. అయినప్పటికీ కొంతమంది మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రాణాలు కోల్పోతున్నారు. తమపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులను దృష్టిలో పెట్టుకుని యువకులు వాహనాలను నడపాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కూర్మన్నపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చినగంట్యాడ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలువు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు జోన్-1 ఈఈ టీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఎల్‌ఎల్‌వీ నగర్, తోకాడ, డ్రైవర్స్‌కాలనీ, కుంచుమాంబ కాలనీ, శ్రీనివాసనగర్, ఆర్‌ఎంసీ ఇండస్ట్రియల్ ఏరియా, చట్టివానిపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే వీఎస్ఈజెడ్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు రాజీవ్‌నగర్, రాసాలమ్మ కాలనీ, వుడా ఫేజ్-1, 6, 7, మాతృశ్రీనగర్, దువ్వాడ స్టేషన్ రోడ్డు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

పెందుర్తి సబ్ స్టేషన్ పరిధిలో..

పెందుర్తి: పెందుర్తి సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈకారణంగా తహసీల్దార్ కార్యాలయం, శారదా నగర్, పెందుర్తి ప్రభుత్వ కళాశాల, రెల్లి కాలనీ, ద్రోణంరాజు నగర్, నవ్యవికాస్ పాఠశాల, గాంధీనగర్, నేతాజీనగర్, పాత ప్రభుత్వ ఆస్పత్రి, అనంత పద్మనాభ టవర్స్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వైభవంగా తిరుప్పావడ సేవ

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కార్తీక మాసం ఆఖరి గురువారాన్ని పురస్కరించుకుని వైభవంగా తిరుప్పావడ సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీవారిని దర్శించుకున్నారు.

సినిమా గైడ్

- **మెకానిక్ రాఖీ :** మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **దేవకీనందన వాసుదేవ :** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **జీబ్రా :** శారద, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
- **కంగువా :** సంగం, రమాదేవి, శ్రీరామ, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **లక్కీభాస్కర్:** వెంకటేశ్వర
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 44, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 30, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 36, క్యారెట్ 70, దొండకాయలు 32, బంగాళదుంపలు 40, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది)50, మునక్కాడలు (కిలో) 82, బరబాటి 32, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, పొటల్స్ 48, కీరదోస 24, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 28, కంద 60, దేముడుచిక్కుడు 62, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, కర్రపెండలం 45, బొప్పాయి 40, బూడిద గుమ్మడికాయ 30, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	105
ఫారం ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230



రాగూర్ ఫార్మా పరిశ్రమను సందర్శిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



కిమ్స్ ఐకాన్‌లో ఆస్పత్రిలో బాధితునితో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

ఫార్మా కంపెనీలో ప్రమాదానికి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణం

బాధ్యులపై చర్యలు తప్పవు

ఎమ్మెల్యే పంచకర్ల, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ

పరవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాగూర్ ఫార్మా కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ ఆరోపించారు. గురువారం వీరు వేర్వేరుగా రాగూర్ ఫార్మా కంపెనీని సందర్శించారు. ప్రమాదానికిగల కారణాలను ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, ఫార్మా పరిశ్రమల్లో కార్మికులకు భద్రత కరువైందని, భద్రతా ప్రమాణాలు పాటించాలని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. పరిశ్రమలు, పీసీబీ, సేఫ్టీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అధికారులపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చూస్తున్నామన్నారు. వీరి వెంట టీడీపీ, జనసేన పార్టీల స్థానిక నాయకులు వున్నారు.

బాధితులకు పరామర్శించిన కలెక్టర్

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఫార్మా కంపెనీ బాధితులను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పరామర్శించారు. ఐసీయులో ఉన్న బాధితులను కలిసి వారి ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. బాధితులు త్వరగా కోలుకునేలా తగిన చికిత్స అందించాలని వైద్యులకు కలెక్టర్ సూచించారు.



తనిఖీలు నిర్వహించాక ఇంటి నుంచి బయటకు వస్తున్న ఏసీబీ అధికారులు

మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ పీఏ ఇంట్లో ఏసీబీ తనిఖీలు

గాజువాక, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత ధర్మాన కృష్ణదాస్ మంత్రిగా ఉన్న సమయంలో పీఏగా పనిచేసిన గొండు మురళీ ఇంట్లో గురువారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. మురళీ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్టు అభియోగాలు రావడంతో నగరంలోని ఆటోనగర్ ప్రాంతంలో గల అతనికి చెందిన ఇంట్లో ఏసీబీ సీఐ సీహెచ్ లక్ష్మణరావు, సిబ్బందితో సోదాలు చేపట్టారు. అయితే మురళీ అక్కడ నివాసం ఉండడం లేదని, ఆయన భార్య పేరిట ఉన్న ఆ ఇంటిని అద్దెకు ఇచ్చినట్టు గుర్తించారు. ప్రతి నెలా అద్దెకు సంబంధించిన నగదును మురళీ భార్య అకౌంట్‌లో జమ చేస్తున్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. అంతకుమించి ఆ ఇంట్లో ఎటువంటి పత్రాలు లభ్యం కాలేదని సీఐ లక్ష్మణరావు తెలిపారు. కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు సమక్షంలో ఈ సోదాలు నిర్వహించారు.

కొండ తవ్వకాలను పరిశీలించిన తహసీల్దార్

పెందుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి వెంకటాద్రి ఘాట్ రోడ్డు అభివృద్ధి పనుల కోసం కొండ తవ్వకాలు చేపట్టడం వల్ల తామంతా భీతిల్లుతున్నామని చినముషిడివాడ అంబేడ్కర్ నగర్, ఏకలవ్య కాలనీవాసులు ఆందోళన నేపథ్యంలో గురువారం తహసీల్దార్ ఆనంద్‌కుమార్ ఆ ప్రాంతాన్ని సందర్శించారు. తవ్వకాలతో కొండ దిగువన గల కాలనీల ప్రజల ఇబ్బందులను క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించారు. భారీ యంత్రాలతో కొండ తవ్వకాలు చేపడుతుండడం వల్ల మట్టిచరియలు విరిగిపడి దిగువన గల రెండు కాలనీపై పడుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారని పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు ఎం.లక్ష్మి తహసీల్దార్‌కు వివరించారు. దీనిపై అధికారికంగా సమీక్షిస్తామని, కాలనీవాసుల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా శాఖాపరమైన చర్యలు చేపట్టనున్నట్టు తహసీల్దార్ వివరించారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలంటూ ఫిర్యాదు

వేపగుంట: జీవీఎంసీ 93వ వార్డు పరిధి శ్రీనివాసనగర్ సమీపంలో సర్వే నంబర్-179లో ఉన్న 42 సెంట్ల ప్రభుత్వ స్థలం స్థానిక నాయకుడు ఆధ్వర్యంలో ఆక్రమణకు గురవుతుందని, ఈ స్థలాన్ని సంరక్షించాలని కోరుతూ తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు జనసేన నాయకుడు బల్ల రవికుమార్ వినతిపత్రం అందజేశారు. ఈ స్థలాన్ని కాపాడి ఇక్కడ సచివాలయాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

'కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలి'

పెదగంట్యాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కర్మాగారంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (ఇంటక్) కార్యనిర్వాహక అధ్యక్షుడు కురందాసు వంశీకృష్ణ ఒక ప్రకటనలో కోరారు. కాంట్రాక్టు కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం వల్ల వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లకు అద్దె, పిల్లలకు పాఠశాలలు, కళాశాలల ఫీజులు చెల్లించలేక నానాపాట్లు పడుతున్నారన్నారు. కుటుంబాలతో జీవనం సాగించేందుకు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నందున వారికి తక్షణమే వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా సాయినాథుని ఆలయ వార్షికోత్సవం



గోపాలపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రశాంతినగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయ 28వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. 1,008 కలశాలతో సాయినాథునికి అభిషేకం చేశారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం చేపట్టిన అన్న సమారాధనలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.



కొండపై ఉన్న శాంతినగర్‌లో పర్యటిస్తున్న గణబాబు, తదితరులు

శాంతినగర్‌లో ఎమ్మెల్యే గణబాబు పర్యటన

మల్కాపురం, నవంబరు 28 : గ్రేటర్ 60వ వార్డు కొండపై ఉన్న శాంతినగర్‌లో గురువారం ఉదయం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పి.గణబాబు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కొండపై ఉన్న రక్షిత మంచినీటి పథకం ట్యాంకును శుభ్రం చేయడం లేదని, ఈ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకోవడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉందని ప్రజలు ఎమ్మెల్యేకు వివరించారు. అందుకు స్పందించిన ఆయన వెంటనే ట్యాంకును శుభ్రపరచడంతో పాటు మరమ్మతు పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అలాగే శిథిలమైన విద్యుత్ స్తంభాలను మార్చాలని, ఇతర అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఎమ్మెల్యే వెంట జోన్-5 కమిషనర్ రాము, నాయకులు మాతా శ్రీను, నక్కా లక్ష్మణరావు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

97వ వార్డులో ఎమ్మెల్యే పంచకర్ల..

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డులో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు గురువారం ఉదయం పర్యటించారు. కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు, జెడ్సీ హేమవతి, ఇతర అధికారులుతో కలిసి ఆయన గిరిప్రసాద్ నగర్, టీచర్స్ కాలనీ, వెంకటాద్రి నగర్ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, రహదారులను పరిశీలించారు. కాలనీవాసులతో మాట్లాడి పారిశుధ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను గుర్తించిన పంచకర్ల వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఇక్కడి పార్కుల అభివృద్ధి రూ.రెండు కోట్లు మంజూరయ్యాయన్నారు. అనంతరం స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎమ్మెల్యే వెంట కూటమి నాయకులు అవగడ్డ అప్పలనాయుడు, ఎస్.సోమశేఖర్, జగన్మోహనపాత్రుడు, తదితరులు ఉన్నారు.

సంస్థ ప్రగతిలో అందరికీ కీలక పాత్ర

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కర్మాగారం ప్రగతిలో ప్రతి ఒక్కరిదీ కీలక పాత్ర అని కోక్-ఓవెన్ విభాగాధిపతి ఎంవీఎస్ దుర్గాప్రసాద్ అన్నారు. విభాగంలో ప్రతిభ చూపిన ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులను గురువారం ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభాగం ఉద్యోగి రొంగలి సత్యనారాయణ ప్లాంట్ ఉత్పత్తి పెంచే క్రమంలో విభాగంలో రిపేరు పనులు పూర్తి చేసి 67 ఓవెన్‌లు (ఉత్పత్తి ప్రక్రియలో భాగా)లను అందుబాటులోకి తీసుకువచ్చారని, ఈ పనుల్లో కాంట్రాక్టు కార్మికులు ఎంతో శ్రమించారన్నారు. అనంతరం కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో అధికారులు వైవీఆర్ శ్రీనివాసరావు, తాతారావు, వెంకటేశ్వరరావు, నరసింహారావు, శ్రీనివాసరావు, తివారి, కార్మిక నాయకులు ఎం.శ్రీనివాస్, ఐ.గంగాధర్, ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మం పేరుతో వంచిస్తున్న కేంద్రం

ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని



సదస్సులో మాట్లాడుతున్న దుర్గాభవాని

పెందుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం పేరుతో పీఎం నరేంద్ర మోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం మహిళలను వంచిస్తోందని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని ఆరోపించారు. గిరిప్రసాద్‌నగర్‌లో ఉన్న సీపీఐ కార్యాలయంలో మహిళా సమాఖ్య ఆధర్యంలో గురువారం సనాతన ధర్మం, మహిళల హక్కులపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోదీ ప్రధానిగా పగ్గాలు చేపట్టినప్పటి నుంచి మహిళలను మహిళలు వంటింటికే పరిమితం చేసేందుకు కుట్ర జరుగుతుందన్నారు. మహిళా హక్కుల సాధనలో ప్రపంచంలో భారతదేశం వెనకబడిపోయిందన్నారు. ఎన్ఎఫ్ఐబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల మాట్లాడుతూ హక్కులపై ప్రశ్నించే మహిళలను భక్తి భావం వైపు మళ్లిస్తూ మోదీ ప్రభుత్వం వంచనకు దిగిందన్నారు. ప్రముఖ అభ్యుదయ రచయిత్రి మల్లీశ్వరి మాట్లాడుతూ స్వాతంత్ర భారతావనిలో మహిళలకు సమాన హక్కులు తీరని కలగా మిగిలిపోయాయన్నారు. కార్యక్రమంలో పెందుర్తి శాఖ కార్యదర్శి ఎ.అన్నపూర్ణ, నాయకులు బేగం రాణి. అరుణ, రజని, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అంతకుముందు జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



పైపు లైన్ల ఏర్పాటు పనుల్లో నిమగ్నమైన సిబ్బంది

టిడ్కో ఇళ్ల కోసం తాగునీటి పైపు లైన్ల ఏర్పాటు

మల్కాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అచ్చినాయుడు తోటలో పచ్చని కొండల మధ్య నిర్మిస్తున్న నాలుగు వేల టిడ్కో ఇళ్లకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు భూగర్భం నుంచి పైపు లైన్లను ఏర్పాటు వేస్తున్నారు. గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న తాగునీటి రిజర్వాయర్ ట్యాంక్ నుంచి పనులను ప్రారంభించారు. సుమారు రూ.మూడు కోట్లతో ఈ పైపు లైన్లను ఏర్పాటు చేస్తున్నారు. యుద్ధప్రాతిపదికన ఈ పనులు జరగాలన్న ఎమ్మెల్యే పి.గణబాబు ఆదేశాల మేరకు జీవీఎంసీ అధికారులు వీటిని ఏర్పాటు చేయిస్తున్నారు. రెండు మూడు నెలల్లోగా ఈ పనులు పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. గాజువాక సుందర్యకాలనీ నుంచి అచ్చినాయుడు తోట వరకు వీటిని ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేయనున్నారు. ఈ పనులు జోరుగా సాగుతుండడం పట్ల టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలంటూ ర్యాలీ



ర్యాలీలో నినాదాలు చేస్తున్న పారిశుధ్య సిబ్బంది, విద్యార్థులు

సింధియా, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలంటూ 40, 63 వార్డుల్లో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు వార్డుల ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్ మాట్లాడుతూ ప్రజలందరూ సహకరిస్తేనే ప్లాస్టిక్ నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. ఎక్కడికక్కడ పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను తిని చాలా పశువులు కూడా మృతి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలను అతిక్రమించి ఎవరైనా వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్లాస్టిక్ కవర్ల స్థానంలో అందరూ క్లాత్, నార సంచులను వినియోగించాలని రమేశ్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

తుంగ్లాంలో వైభవంగా లక్ష బిల్వార్చన



లక్ష బిల్వార్చనలో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆఖరి గురువారం తుంగ్లాంలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన లక్ష బిల్వార్చనను వైభవంగా నిర్వమించారు. వేదపండితులు ఉమారామలింగేశ్వరులకు పంచామృతాలతో అభిషేకించి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ కౌన్సిలర్ కాకి శ్రీదేవి లక్ష బిల్వార్చనను ప్రారంభించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు సలాది అచ్చిబాబు, వి.అప్పారావు, సింహాచలం తదితరులు తగిన ఏర్పాట్లు చేపట్టారు.

'జ్యోతిరావు పూలే జీవితం ఆదర్శనీయం'

గాజువాక, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం ఆదర్శనీయమని, ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని టీడీపీ 'గాజువాక' సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో గురువారం పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం తన జీవితాన్నే అంకితమిచ్చిన గొప్ప వ్యక్తి అని పూలే అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.శివప్రసాదరావు, పి.వెంకటేశ్వరరావు, జ్యోతికుమార్, రామోజీ బ్రహ్మాజీరావు, జనార్ధనరావు, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎన్‌హెచ్ఏఐ పీడీ ప్రభాత్ రంజన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అగనంపూడి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అగనంపూడి టోల్‌గేటు సమీపంలో అసంపూర్తిగా వదిలేదిన రోడ్డు మరమ్మతు పనులను ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఎట్టకేలకు చేపట్టారు. టోల్‌గేటు నుంచి స్థానిక పెట్రోల్ బంక్ వరకు సుమారు అర కిలోమీటరు మేర రోడ్డు మరమ్మతుల నిమిత్తం పై లేయర్‌ను తొలగించి పనులు నిలిపివేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'అసంపూర్తి రోడ్డు నిర్మాణ పనులతో అవస్థలు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఎన్‌హెచ్ఏఐ అధికారులు స్పందించారు. గురువారం సంస్థ పీడీ ప్రభాత రంజన్ ఈ రహదారిని పరిశీలించి, పనులను పర్యవేక్షించారు.

ఉక్కు రక్షణకు పోస్టు కార్డుల ఉద్యమం

పెందుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ ఆధ్వర్యంలో గురువారం పెందుర్తిలో పోస్టు కార్డుల ఉద్యమం నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద పోస్టుకార్డులను ప్రదర్శిస్తూ విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రజాసంస్థ కన్వీనర్ వీవీ రమణమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరించకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యోగులకు తక్షణమే బకాయిలు చెల్లించాలన్నారు. అనంతరం పలువురికి పోస్టు కార్డులు అందజేసి ఉక్కు ఉద్యమానికి సహకరించాలని కోరారు.

మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

కూర్మన్నపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీఎల్‌సీ సంస్థ ఆధ్వర్యంలో గురువారం శ్రీనగర్‌లోని చర్చి ఆవరణలో పేద మహిళలకు కుట్టుమిషన్లను చర్చి చైర్మన్ బిషప్ మెహంతి చేతుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు చెందిన మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు వీలుగా వీటిని అందజేస్తున్నామన్నారు. ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ, అవసరమైన ప్రాంతాల్లో గొట్టపు బావులు వేయడం, హెచ్ఐవీ బాధితులకు ఆర్థిక సాయం అందజేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

పోటీ పరీక్షలపై ఐటీఐ అభ్యర్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రైనర్

కంచరపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో గురువారం పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రైనర్స్ బి.ప్రసాద్, సంతోష్ పాల్గొని యువతకు వివిధ పరీక్షలకు సన్నద్ధతపై అవగాహన కల్పించారు. ఒకవైపు చదువుకుంటూనే.. మరో వైపు పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడంపై పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ పక్కా ప్రణాళికతో చదివితే లక్ష్యాలను చేరుకోవడం సాధ్యమేనన్నారు. కార్యక్రమంలో ఐటీఐ సిబ్బంది, అన్ని ట్రేడుల అభ్యర్థులు పాల్గొన్నారు.

'బండి కాదు మొండి ఇది సాయం పట్టండి'

» అర్ధాంతరంగా ఆగిన ఆర్టీసీ బస్సు



బస్సును తోస్తున్న ప్రయాణికులు

మురళీనగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగరలో ఆర్టీసీ బస్సులు ప్రయాణీకులకు చుక్కలు చూపిస్తున్నాయి. వేళకు రావు... వచ్చినా ఆగవు. మరోవైపు సాంకేతిక ఇబ్బందులతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మాధవధార, కైలాసపురం, పోర్టు క్వార్టర్ల మీదుగా ఆర్టీసీ కాంప్లెక్సు చేరే 48ఎ రూట్ బస్సు పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. గురువారం మాధవధార ఉడా కాలనీలో బస్సు చివరి స్టాపు వద్ద మొరాయించింది. దీంతో బస్సు ఎక్కిన ప్రయాణికులే దిగి డ్రైవరు, కండక్టరు సూచనలతో ముందుకు నెట్టారు. సాయంత్రం వేళ చాలా సేపు బస్సు ఇక్కడే ఆగిపోయింది. దీంతో స్కూళ్లు, కాలేజీలు సహా ఉద్యోగ విధుల నుంచి ఇళ్లకు చేరేవారు ఇబ్బంది పడ్డారు. ఆర్టీసీ అధికారులు ఈ రూట్‌లో తిరిగే 48ఎ, ఇటీవలే కొత్తగా ఆరంభించిన 48ఎస్ సర్వీసులు రెండు మాత్రమే తిరిగే ఈ రూట్‌లో కండీషన్‌లో ఉండే బస్సులు నడపాలని ప్రయాణికులు నిట్టూరుస్తున్నారు. గంటల తరబడి వేచి ఉన్నా వచ్చే బస్సులు కూడా ఇలా మొరాయిస్తే, తమకు ప్రయాణ ఇబ్బందులు తప్పడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

శరవేగంగా సర్వే

జ్ఞానాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి చేపడుతున్న సర్వే జోన్-5 పరిధిలో శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే సచివాలయం సిబ్బంది 79 శాతం సర్వే పూర్తిచేశారు. గత ప్రభుత్వ హయాంలో వలంటీర్లు చేసిన సర్వేలో కుటుంబాల వివరాలు చాలాచోట్ల తప్పుగా నమోదయ్యాయి. దీని వల్ల ప్రస్తుతం సచివాలయం సిబ్బంది చేపడుతున్న సర్వేలో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జోన్-5 పరిధిలోని 23 వార్డుల్లో మొత్తం 118 సచివాలయాల్లో 1,39,500 కుటుంబాలు ఉండగా ఇప్పటికే 1,10,600 కుటుంబాల సర్వే పూర్తి చేసినట్టు జడ్సీ రాము తెలిపారు.సంక్షేమ పథకాలు పొందేందుకు ప్రజలు తప్పనిసరిగా సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలని చెప్పారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

జ్ఞానాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని 41వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అన్నారు. గురువారం జ్ఞానాపురం మెయిన్ రోడ్డులో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో ఉన్న వ్యాపారులకు, స్థానికులకు ప్లాస్టిక్ వినియోగం జరిగే నష్టాలు గురించి ఆయన వివరించారు.

చావులమదుం రోడ్డుకు మరమ్మతులు

జ్ఞానాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చావులమదుం బ్రిడ్జి రోడ్డుకు ఎట్టకేలకు మరమ్మతులు చేపడుతున్నారు. ఈ రోడ్డు మరమ్మతు పనులకు ప్రభుత్వం రూ. 19 లక్షల విడుదల చేసింది. పనులు జరుగుతుండడంతో వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

డాబాగార్డెన్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆర్‌బీఎంయూపీ పాఠశాల హెచ్‌ఎం హనుమంతు ప్రభాకర్ అన్నారు. గురువారం పాఠశాలలోని 1 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నార్త్‌ఈస్ట్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో దంత పరిరక్షణ ఎంతో ముఖ్యమన్నారు.దంతలు శుభ్రంగా ఆరోగ్యంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం. సురేశ్, చిన్నికృష్ణ, ఉపాధ్యాయులు నాగేశ్వర రావు, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా షూటింగ్

జగదాంబ కూడలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జగదాంబ థియేటర్‌లో గురువారం కోర్టు సినిమా షూటింగ్ జరిగింది. థియేటర్ వద్ద ప్రభాస్ నటించిన మిర్చి సినిమా పోస్టర్లు కట్టి యువత సందడి చేసిన సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ చిత్రంలో నూతన హీరో, హీరోయిన్లు నటిస్తున్నారు.

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి



జ్యోతిరావు పూలెకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్. పలువురు కార్పొరేటర్లు

సీతంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సీతంపేట రాజేంద్రనగర్‌లో గల నగర జనసేన పార్టీ కార్యాలయంలో సామాజిక సంస్కర్త జ్యోతిరావు పూలే వర్థంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంటరానితనం, మహిళా హక్కులు, కుల వ్యవస్థ నిర్మూలన వంటి సామాజిక రుగ్మతలపై పోరాడిన సామాజిక సంస్కర్త పూలే అని ఎమ్మెల్యే కొనియాడారు. కార్యక్రమంలో సౌత్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివప్రసాద్, పలు వార్డుల కార్పొరేటర్లు కందుల నాగరాజు, పీతల మూర్తియాదవ్, కంటిపాము కామేశ్వరి, జి.వీరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు నారా నాగేశ్వరరావు, కోనూరి శ్రీనివాస్, జయన సునీల్, మర్రివేముల శ్రీనివాస్, జనసేన మహిళా కో-ఆర్డినేటర్ అమరాపు దుర్గ లక్ష్మి చౌదరి, జనసేన వీరమహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకుని సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య సాంబశివరావు

సీతంపేట, నవంబరు 28 : ఉద్యోగులు ఎప్పటికప్పుడు నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్, చాప్టర్ ప్రెసిడెంట్ కేవీ రావు పేర్కొన్నారు. ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో నేషనల్ హెచ్‌ఆర్డీ నెట్ వర్క్ విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో 'లెర్నింగ్ సైకిల్' అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు సంస్థల ప్రతినిధులు, విశ్వవిద్యాలయాల ఆచార్యులు పాల్గొన్నారు. సభకు ఆచార్య నాదెండ్ల సాంబశివరావు అధ్యక్షత వహించి అంశం ప్రాధాన్యత వివరించారు. చాప్టర్ అధ్యక్షులు కేవీ రావు మాట్లాడుతూ సంస్థలలో పని చేసి ఉద్యోగులు పని సామర్థ్యం పెంచడం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి వి.భాస్కర్ శ్రీనివాస్, కృష్ణకుమార్, శేషగిరి రావు, ఎన్వీఎస్ సుధాకర్, శ్రీరాములు, పల్లవి, రవికుమార్, ఎస్.సుధాకర్, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి పార్కు సమస్యలు



అధికారులకు సమస్యలు వివరిస్తున్న చంద్రమౌళి

మురళీనగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 50వ వార్డు వాకర్స్ పార్కు సుందరీకరణ, వసతుల కల్పనలో భాగంగా కొత్త ప్రతిపాదనలు చేశారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పల్లా చంద్రమౌళి గురువారం పార్కు అవసరాలు, పార్కులోని సమస్యలను జీవీఎంసీ ఇంజనీరింగ్ సిబ్బందికి వివరించారు. ఈ నేపథ్యంలో వార్డు ఇంజనీరింగ్ విభాగం ఇన్‌చార్జి ఏఈ సతీష్‌కు పార్కు సందర్శించారు. పార్కులో అంతర్గత రహదారులు, పిల్లల క్రీడా సామగ్రి, వ్యాయామ పరికరాల ఏర్పాటు కోసం పార్కు కమిటీ అధ్యక్షులు, కార్యవర్గం ఇంజనీరింగ్ సిబ్బందికి విన్నవించారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసికెళ్లనున్నట్టు ఇంజనీరింగ్ సిబ్బంది వివరించారు.

ఆకట్టుకున్న 'కన్యాశుల్కం'

పాత్రధారులుగా నటించి నాటకాన్ని రక్తికట్టించిన రచయితలు



నాటకంలో ఓ రసవత్తర సన్నివేశం

సీతంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శించిన కన్యాశుల్కం సంక్షిప్త నాటిక ఆహూతులను అలరించింది. నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు వర్థంతి సందర్భంగా ఆయన రాసిన కన్యాశుల్కం నాటకాన్ని విశాఖలోని అందరు రచయితలు కలిసి నటించి నాటకాన్ని రక్తికట్టించారు. డాక్టర్ పేరి రవికుమార్ దర్శకత్వం వహించారు. తొలుత గురజాడ అప్పారావు వేషధారణలో డాక్టర్ డీవీ సూర్యారావు విచ్చేసిన కన్యాదానం నాటక విశిష్టత గురించి వివరించారు. ఇక నాటకంలో వెంకటేశంగా ఓలేటి శంకర్, అగ్ని హోత్రావధాన్లుగా పిల్లా వెంకట రమణమూర్తి, కరటక శాస్త్రిగా సీహెచ్ చిన సూర్యనారాయణ, లుబ్ధావదాన్లుగా వీవీ రమణమూర్తి, సౌజన్యరావు పంతులుగా డాక్టర్ కేవీఎస్ మూర్తి, వెంకమ్మగా బి.రాధారాణి, పూటకూళ్ళమ్మగా శివజ్యోతి, మధురవాణిగా సుప్రియ, గిరీశంగా రాంభట్ల నృసింహశర్మ, రామప్ప పంతులుగా డాక్టర్ పేరి రవికుమార్, రంగాలంకరణ, ఆహార్యంగా నవరస మూర్తిలు తమ పాత్రలతో రంజింపజేశారు. సౌండ్‌తో కువైట్ స్వామి, సంగీతం పి.రాజు, సహకారం వర్రే నాంచారయ్య, అనుసంధానం మేడా మస్తాన్‌రెడ్డిలు తమ సేవలను అందించారు. ఈ నాటికలో పాత్రలను రచయితలు వేయడం విశేషంగా ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కళాభిమానులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పోలీసుల చేతివాటం

... 5వ పేజీ తరువాయి

సిద్ధపడుతుంటారు. ఇలాంటివారి బలహీనతను అవకాశంగా తీసుకుని కొంత మంది పోలీసులు జేబులు నింపుకుంటున్నారు. పట్టుబడిన వ్యక్తులను కోర్టు పేరు చెప్పి.. మరింత ఆందోళనకు గురిచేసి భారీగా డబ్బులు గుంజేసి విడిచిపెట్టేస్తున్నారు. ఒకవేళ కేసు నమోదుచేయక తప్పని పరిస్థితి ఏర్పడితే మాత్రం ఎంతో కొంత జరిమానా అధికారికంగా కట్టినట్టు చూపించి, వారిని కోర్టుకు తరలించకుండా తప్పించేస్తున్నారు. నగరంలో చాలాచోట్ల సిబ్బంది ఇదే ధోరణి అవలంబిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సిబ్బందికి సంబంధిత ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ రైటర్లు, ఎస్‌ఐ సహకారం ఉండడంతో గుట్టుచప్పుడు కాకుండానే వసూళ్లపర్వం సాగిపోతోంది. ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో పట్టుబడిన వ్యక్తి నుంచి డబ్బులు తీసుకుని స్టేషన్‌కు తరలించకుండా తప్పించేయడంపై సీపీ శంఖబ్రత బాగ్చీకి గుర్తుతెలియని వ్యక్తులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన విచారణకు ఆదేశించారు. వాస్తవమేనని తేలడంతో త్రీటౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐగా అటాచ్‌మెంట్‌పై పనిచేస్తున్న ప్రభాకరావుతోపాటు స్టేషన్ రైటర్‌ను సీపీ సస్పెండ్ చేశారు. కొన్నాళ్ల కిందట బీచ్‌రోడ్డులో ట్రాఫిక్ ఎస్‌ఐ, హోంగార్డు కలిసి...డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తి నుంచి డబ్బులు ఫోన్‌పే చేయించుకున్న విషయం వెలుగులోకి రావడంతో సీపీ సస్పెన్షన్ వేటు వేశారు. ఫోర్త్ టౌన్, టూటౌన్ స్టేషన్ల పరిధిలో కూడా గతంలో ఇలాంటి ఉదంతాలు వెలుగులోకి రావడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో అనధికార వసూళ్లు కొనసాగుతున్నప్పటికీ ఉన్నతాధికారులు సీరియస్‌గా దృష్టిసారించడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటున్నారే తప్పితే, ప్రత్యేకంగా సిబ్బంది పనితీరుపై నిఘా పెట్టడం లేదు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు జరుగుతున్న తీరుతెన్నులతోపాటు సంబంధిత సిబ్బందిపైనా సీపీ ప్రత్యేక నిఘా పెట్టాలని కోరుతున్నారు.

51వ వార్డులో కుక్కల నియంత్రణకు చర్యలు

మాధవధార, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 51వ వార్డులోని మాధవధార ఉడా కాలనీ, చిట్టిబాబు కాలనీ ప్రాంతాల్లో గురువారం జీవీఎంసీ సిబ్బంది కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టారు. ప్రధాన కార్యాలయానికి నిత్యం ఈ ప్రాంతాల నుంచి వస్తున్న ఫిర్యాదులు అందుతుండడంతో చర్యలు తీసుకున్నారు.



కోర్టు ఆవరణలో ఉన్న పూలే విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

బడుగుల ఆశాజ్యోతి పూలే

కలెక్టర్ హరేంధిర ప్రసాద్



పార్టీ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న ప్రణవ్ గోపాల్

మహారాణిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. గురువారం పూలే వర్థంతి సందర్భంగా జిల్లా కోర్టు సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమ సమాజం స్థాపనకు పూలే ఎన లేని కృషి చేశారన్నారు.ఈ కార్యక్రమంలో అధికా రులు రమణమూర్తి, శ్రీదేవి, పితాని ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, తదితరులు కూడా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

జగదాంబ కూడలి : గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు అన్నారు.జిల్లా కోర్టు సమీపంలో ఉన్న పూలే విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం సత్య శోధక్ సమాజ్ అనే సంస్థను స్థాపించారన్నారు. సామాజిక సాధికారత కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అచ్యుతరావు,రెహమాన్, ఎం. మన్మథరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జగదాంబ కూడలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జగదాంబ జంక్షన్ లక్కీమాల్, దసపల్లా, వాచ్‌హౌస్ వద్ద ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను ట్రాఫిక్ పోలీసులు గురువారం తొలగించారు. రోడ్డు విస్తరించినా.. ఇరుకేనా ? అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి మహారాణిపేట ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ఈమేరకు జగదాంబ జంక్షన్, లేపాక్షి ఏరియాల్లో ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఫుట్‌పాత్‌లను పూర్తిగా ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న వారిని ఖాళీ చేయించారు. అలాగే వాచ్‌హౌస్ నుంచి కుమ్మర వీధి లోపల రహదారి మార్గం పూర్తిగా మూతబడడంతో అక్కడి వ్యాపారులను హెచ్చరించారు.





అమ్మవారికి పూజ చేస్తున్న మహిళలు, క్యూ లైన్‌లో బారులు తీరిన భక్తులు

వన్‌టౌన్‌లోని కనక మహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి భక్తులు గురువారం పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ రద్దీ కొనసాగింది. వచ్చే నెల 2 నుంచి మార్గశిర మాసోత్సవాలు ప్రారంభం కానుండడంతో అమ్మవారి దర్శనానికి భారీ తరలివచ్చారు. - జగదాంబ కూడలి



ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీలు, పలు సంస్థల సభ్యులు

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

మహారాణిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని జస్టిస్ ఫర్ చిల్డ్రన్స్ ఆఫ్ హోల్డ్ ఎన్‌జీవో జిల్లా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ బి. డేవిడ్ రాజు పిలుపునిచ్చారు. బాల్య వివాహ్, ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆ సంస్థ ఆధ్వర్యంలో మహారాణిపేట, కలెక్టరేట్ జంక్షన్, జగదాంబ జంక్షన్‌లో అవగాహన సదస్సు, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు దేశ అభివృద్ధికి తీవ్ర విఘాతంగా మారాయని చెప్పారు. బాల్య వివాహాలను నిర్మూలించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు.

ఫార్మా ప్రమాద మృతులకు రూ. కోటి నష్టపరిహారం ఇవ్వాలి : సీఐటీయూ

మహారాణిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పరవాడ ఫార్మా సిటీలోని ఠాగూర్ లేబొరేటరీస్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమలో గ్యాస్ లీకై మృతి చెందిన వారి కుటుంబాలకు కోటి రూపాయలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఠాగూర్ ఫార్మాలో విష వాయువు లీకై మృతి చెందిన వారి మృతదేహాలకు గురువారం కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించారు ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం కుమార్ మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా..ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిన రెండు ప్రమాదాల్లో 21 మంది మృతి చెందారని చెప్పారు. ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణ కమిటీ పేరుతో కాలయాపన చేస్తుంది తప్ప కమిటీల నివేదికలను బహిర్గతం చేయడం లేదని ఆరోపించారు. పరిశ్రమల యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలను గాలికి వదిలేస్తున్నాయని చెప్పారు. ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యల తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సామాజిక సేవకుడు వానపల్లి రవికుమార్

డాబాగార్డెన్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చివరి శ్వాస వరకు ప్రజా సేవకే అంకితమైన గొప్పవ్యక్తి 31వ వార్డు కార్పొరేటర్ స్వర్గీయ వానపల్లి రవికుమార్ అని వక్తలు కొనియాడారు. గురువారం డాబా గార్డెన్స్‌లో రవికుమార్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సతీమణి వానపల్లి ఫణి గాయత్రీకుమారి ప్రేమ సమాజంలోని వృద్ధులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అనంతరం చిన్నారుల మధ్య కేట్ కటింగ్ చేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ నగర అధ్యక్షుడు గండి బాబ్జీ హాజరై రవికుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవికుమార్ రాజకీయాల్లో, ప్రజాసేవలో నిరంతరం గడిపేవారన్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సారిపల్లి మహేశ్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. కాగా వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ టీడీపీ కార్యాలయంలో రవికుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవకు చిరునామా వానపల్లి అని, ఆయన్ను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వానపల్లి సత్య, పప్పు శ్రీనివాసరావు, రాజమండ్రి నారాయణ, కోటా నరేశ్, నీలకంఠం, జోకర అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఠాగూర్ ఫార్మా ప్రమాదంలో మరొకరి మృతి

పరవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో గల ఫార్మాసిటీలోని ఠాగూర్ లేబొరేటరీస్‌లో మంగళవారం సాయంత్రం విష వాయువులు లీకైన ఘటనలో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న సీహెచ్ వీరశేఖర్ (36) అనే ఉద్యోగి గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. దీంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య రెండుకు చేరింది. కాగా వీరశేఖర్ రెండేళ్లుగా పరిశ్రమలో వేర్‌హౌస్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం గుంతనవానిపాలేనికి చెందిన వీరశేఖర్‌కు భార్య సూర్యకళ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అగనంపూడి సమీపంలో గల ఫార్మా పునరావాస కాలనీలో నివాసం ఉండేవారు. కాగా విశాఖ కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని శుక్రవారం కుటుంబసభ్యులకు అప్పగిస్తామని పరవాడ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. ఇదిలావుంటే ఇదే ప్రమాదంలో బుధవారం మృతిచెందిన అమిత్‌భాగ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి గురువారం కుటుంబసభ్యులకు అప్పగించారు. పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పర్యవేక్షణలో సీఐ మల్లికార్జునరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఠాగూర్ ఫార్మాలో మరో 18 మందికి అస్వస్థత

ఠాగూర్ ఫార్మాలో విష వాయువుల లీకైన ఘటనలో అస్వస్థతకు గురైన మరో 18 మంది ఉద్యోగులు గురువారం విశాఖ నగరంలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరారు. వీరికి అత్యవసర చికిత్స అందిస్తున్నట్టు సీఐ జి.మల్లికార్జునరావు తెలిపారు. మంగళవారం జరిగిన విషవాయువుల లీకేజీ ఘటనలో తొలుత 11 మంది ఉద్యోగులు అస్వస్థతకు గురికాగా ఆస్పత్రుల్లో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం ఒకరు, గురువారం మరొకరు మృతిచెందారు. ఆ తొమ్మిది మందితో పాటు గురువారం చేరిన మరో 18 మంది కలిపి మొత్తం 27 మంది చికిత్స పొందుతున్నారు. అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని సీఐ తెలిపారు.

ప్రాణాలు తీస్తున్న ఫార్మా కంపెనీలు

... 5వ పేజీ తరువాయి

కంపెనీలకు వెళ్లాల్సిందిగా ఆదేశిస్తున్నారు. దీనివల్ల తనిఖీలు సరిగ్గా జరగడం లేదు. రాష్ట్రంలో అత్యధిక ఫార్మా కంపెనీలు ఉన్నది ఇక్కడే. అధికారులకు అధిక ఆదాయం ఇచ్చే జిల్లా కూడా ఇదే. దాంతో ఆ శాఖలోని పెద్దలు వారికి అనుకూలంగా ఉండేవారిని ఇక్కడ పెట్టుకొని తూతూమంత్రపు తనిఖీలతో జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విచిత్రంగా ఎల్‌జీ పాలిమర్స్ నుంచి ఠాగూర్ కంపెనీ వరకు పెద్ద ప్రమాదాలు జరిగిన కంపెనీలన్నీ కొద్దిమంది అధికారులు తనిఖీ చేసినవే కావడం గమనార్హం. వారికి తనిఖీ చేసే సామర్థ్యం లేదా?, జేబులు నింపుకొని మిన్నకుంటున్నారా?...అనేది ప్రభుత్వం తేల్చాల్సి ఉంది. ఇటీవల ఒక అధికారిని దుష్ప్రవర్తన కారణంగా సస్పెండ్ చేశారు. ఇప్పుడు మూడు జిల్లాలకు కలిపి పరిశ్రమలను తనిఖీ చేసేందుకు ఇన్‌స్పెక్టర్ ఒక్కరే ఉన్నారు. అన్నీ తమ చేతుల్లోనే ఉండాలని ఇలా చేస్తున్నారా?...అనే అనుమానాలు కూడా కలుగుతున్నాయి.

సూచనలు బేఖాతరు

ఎసెన్షియా ప్రమాదం తరువాత విజయవాడ నుంచి పరిశ్రమలు, అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు వచ్చారు. అధికారులు, కార్మికులతో మాట్లాడారు. ప్రమాదాలు జరగకుండా పలు సూచనలు చేశారు. వాటిని అమలు చేయాల్సిందిగా సూచించారు. అలాగే గుర్తించిన లోపాలు కూడా వెల్లడించారు.

సేఫ్టీ ఆడిట్ ఏమైంది..?

ఎసెన్షియా ప్రమాదం తరువాత వారం రోజుల్లో ప్రతి కంపెనీ కూడా సేఫ్టీ ఆడిట్ నిర్వహించి నివేదిక సమర్పించాలని విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు ఆదేశించారు. ఇదంతా ఆ ఒక్కరోజు హడావుడిగానే మిగిలిపోయింది. ఎవరు ఆడిట్ చేశారు?, ఎవరు చేయలేదు?, కారణాలు ఏమిటి?...అనేది సమీక్షించలేదు.

ఏ ఎండకు ఆ గొడుగు!

... 5వ పేజీ తరువాయి

చేరారు. తన భార్యకు టిక్కెట్ సంపాదించుకున్నారు. అధికార పార్టీ కార్పొరేటర్ భర్తననే అధికారాన్ని ఉపయోగించుకుని కృష్ణా కాలేజీ వెనుకవైపు 800 గజాల ప్రభుత్వ స్థలాన్ని తప్పుడుపత్రాలతో ఆక్రమించుకున్నారనే అభియోగం సత్యారెడ్డిపై ఉంది. ఆ భూమిలో రెండు వ్యక్తిగత ఇళ్ల నిర్మాణానికి జీవీఎంసీ అధికారులపై ఒత్తిడి తెచ్చి ప్లాన్ సంపాదించి, అందులో ఏకంగా భారీ వాణిజ్య భవనం నిర్మించేశారు. ఆ భవనంలో పాఠశాల ఏర్పాటుచేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో ఆ భూమికి సంబంధించిన వివాదం తెరపైకి వచ్చింది. ప్లాన్‌ను ఉల్లంఘించారనే అభియోగంపై ఇప్పటికే జీవీఎంసీ అధికారులు నోటీసులు జారీ చేశారు. రెవెన్యూ శాఖ అధికారులు కూడా ప్రభుత్వ భూమికి తప్పుడు పత్రాలు సృష్టించారనే ఆరోపణలపై విచారణ ప్రారంభించారు. దీంతో అక్రమ భవనాన్ని కాపాడుకునేందుకు సత్యారెడ్డి ఇప్పుడు టీడీపీలో చేరారనే విమర్శలు రెండు పార్టీల నుంచి వినిపిస్తున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సత్యారెడ్డి వార్డులో టీడీపీ నాయకులు, కార్యకర్తలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేశారు. సాధారణ ఎన్నికలకు ముందు ఎంవీపీ కాలనీలో జరిగిన సిద్ధం సభలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అలాంటి వ్యక్తి తన వ్యక్తిగత ప్రయోజనం కోసం టీడీపీలో చేరేందుకు యత్నిస్తుంటే 23వ వార్డులోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తీవ్రస్థాయిలో వ్యతిరేకించారు. తమను వేధించిన వ్యక్తిని పార్టీలో చేర్చుకోవద్దని నియోజకవర్గ నేతలకు మొరపెట్టుకున్నారు. అయినప్పటికీ సత్యారెడ్డికి బాగా ఆప్తుడైన ఎమ్మెల్యే వెలగపూడి అనుచరుడు ఒకరు ఒత్తిడి చేయడంతో పార్టీలో చేర్చుకున్నారనే ప్రచారం జరుగుతోంది.

జబ్బరుతోటలో అతిసార

... 5వ పేజీ తరువాయి

ఇళ్లకు చెందినవారే డయేరియా బారినపడ్డారు.

ఈ లక్షణాలతో ఇబ్బందులు

గడిచిన ఐదు రోజుల నుంచి ఆ ప్రాంతానికి చెందిన పలువురు విరోచనాలు, వాంతులతో ఇబ్బంది పడుతున్నారు. రోజురోజుకూ బాధితుల సంఖ్య పెరగడంతో స్థానికుల్లో ఆందోళన మొదలైంది. ఆరోగ్యశాఖ సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారాన్ని ఇవ్వడంతో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఇబ్బందిగా ఉన్న వారిని ఆస్పత్రుల్లో చేర్పిన అధికారులు వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. శానిటేషన్ చర్యలను జీవీఎంసీ సిబ్బంది చేపట్టారు.

పద్ధతి మార్చుకోండి

... 5వ పేజీ తరువాయి

కొంతమంది పనితీరు మార్చుకోనిపక్షంలో కఠిన చర్యలకు గురికాకతప్పదని హెచ్చరించినట్టు సమాచారం. టౌన్‌ప్లానింగ్ విభాగంలో వార్డు ప్లానింగ్ కార్యదర్శులే అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నట్టు తనకు ఫిర్యాదులు అందుతున్నాయని, ఇకపై అలాంటి వాటికి స్వస్తి పలకాలని కమిషనర్ సూచించినట్టు తెలిసింది. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ స్పష్టంచేసినట్టు సమీక్షకు హాజరైన అధికారులు చెబుతున్నారు.

2,12,662

... 5వ పేజీ తరువాయి

తెలిపారు. వీరిలో 1,57,999 మందికి రూ.12,54,55,030 జమ అయ్యాయన్నారు. కాగా జిల్లాలో ఉచిత గ్యాస్ సిలిండర్ సబ్సిడీ పొందగోరు బియ్యం కార్డుదారులు తమ బ్యాంకు ఖాతాలను పునరుద్ధరించుకోవాలని జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ కోరారు. సిలిండర్ బుక్ చేసుకునే సమయంలో వినియోగదారుడి ఆధార్ నంబరుకు, బ్యాంకు ఖాతా నంబరు/ఫోన్ నంబర్‌కు అనుసంధానం కాలేదని, ఇంకా బ్యాంకు ఖాతాకు ఈకేవైసీ చేయలేదని సమాచారం వస్తోందన్నారు. వినియోగదారులు గతంలో ఖాతా ఉన్న బ్యాంకుకు వెళ్లి ఆధార్ నంబరు, ఫోన్ నంబరుతో అనుసంధానం చేసుకోవాలన్నారు. ఒకవేళ బ్యాంకు ఖాతాలు మూసివేస్తే వాటిని యాక్టివ్ చేసుకునేలా సరైన పత్రాలను బ్యాంకు సిబ్బందికి అందజేయాలని కోరారు.

టీచర్ల శిక్షణా తరగతులను రద్దు చేయాలి : యూటీఎఫ్

అక్కయ్యపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కాలయాపన, బోధనకు ఆటంకం కలిగించే విధంగా ఉన్న రెసిడెన్షియల్ శిక్షణా తరగతులను తక్షణమే రద్దు చేయాలని యూటీఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టీఆర్ అంబేడ్కర్ కోరారు. ఎఫ్ఎల్ఎన్, ఎన్ఎల్టీపీ పేరిట రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహిస్తున్న శిక్షణా కేంద్రంలో ఉపాధ్యాయులు మరణించడం చాలా దురదృష్టకరమన్నారు. విజయనగరం జిల్లా గజపతినగరంలో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణా కేంద్రంలో ఉపాధ్యాయుడు గుండెపోటుతో మరణించడం పట్ల తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. మరణానికి బాధ్యులైన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

☛ సంక్షిప్తంగా..

వీఎంఆర్డీఏలో జ్యోతిరావు పూలె వర్ధంతి



పూలెకు నివాళి అర్పిస్తున్న ప్రణవ్ గోపాల్

సిరిపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దేశంలో కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు జ్యోతిరావు పూలేఅని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ అన్నారు. గురువారం సిరిపురం వీఎంఆర్డీఏ భవన్‌లో పూలే 134వ వర్ధంతి నిర్వహించారు. తొలుత జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కర్త నాగలక్ష్మి, చైతన్య, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి అశోక్, నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ రతన్‌కాంత్, ప్రీతమ్ పాల్గొన్నారు.

30, 1 తేదీల్లో ధ్యానంపై అరుణాజీ ప్రవచనాలు



మాట్లాడుతున్న కోశాధికారి భారతి

సిరిపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నిష్కామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ధ్యానం నిర్వయ నమః' అనే అంశంపై ఆంధ్రా యూనివర్సిటీ డా.వైవీఎస్ ఆడిటోరియంలో ఈ నెల 30, డిసెంబరు 1న రెండు రోజుల పాటు సాయంత్రం ఆరు గంటలకు లెక్చర్ సిరీస్ నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ కోశాధికారి కె.భారతి తెలిపారు. గురువారం సిరిపురంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు అరుణాజీ ధ్యానం విశిష్టత గురించి తన ప్రవచనాల ద్వారా తెలియజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎన్.శాంతిప్రియ, కార్యదర్శి ఎం.అనురాధ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, నవంబరు 28 : (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు విద్యుత్ శాఖ జోన్-3 ఈఈ (ఆపరేషన్స్) పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ మరమ్మతు పనులు చేపడుతుండడంతో సంతపాలెం, తోటగరువు, గాంధీనగర్, బాలాజీ నగర్, శ్రీహరినగర్, రవీంద్రనగర్, ముస్తాఫా కాలనీ, అన్నానగర్, కైలాషనగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

సినిమా గైడ్

● **మెకానిక్ రాఖీ:** మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

● **దేవకీనందన వాసుదేవ:** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **జీబ్రా:** శారద, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)

● **కంగువా:** సంగం, రమాదేవి, శ్రీరామ, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక)

● **లక్కీభాస్కర్:** వెంకటేశ్వర

● **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 44, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 30, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 36, క్యారెట్ 70 దొండకాయలు 32, బంగాళ దుంపలు 40, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, పొటల్స్ 48, కీర దోస 24, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడ దుంపలు 28, కంద 60, దేముడు చిక్కుడు 62, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	105
ఫారం ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

గ్రీన్‌బెల్ట్‌లో బడా వ్యాపారాలు

» పీతలవానిపాలెం వద్ద జాతీయ రహదారిపై యథేచ్ఛగా ఆక్రమణలు

» పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



హోండా షోరూమ్ ఎదురుగా ఆక్రమణలకు గురైన గ్రీన్‌బెల్ట్

మద్దిలపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వవార్డు పీతలవానిపాలెం జాతీయరహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్ ఆక్రమణలకు గురైంది. గ్రీన్‌బెల్ట్‌లో యథేచ్ఛగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. చెట్లు తొలగించి చదును చేసి వాహన వ్యాపారాలు చేస్తున్నా జీవీఎంసీ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.

ఓ పక్క కాలుష్య నివారణ కోసం గ్రీన్ బెల్ట్ నిర్వహణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోంది. పచ్చదనం కోసం జీవీఎంసీ 10 శాతం గ్రీన్ కవరింగ్ ఫండ్ కేటాయిస్తోంది. ఇప్పటికే నగరంలో 1120 గ్రీన్‌బెల్ట్‌లు అభివృద్ధి చేయడానికి ఈ ఫండ్‌ను ఖర్చు చేస్తోంది. పచ్చదనం మెరుగు కోసం ఎన్ని చర్యలు తీసుకున్నటప్పటికీ గ్రీన్‌బెల్ట్‌లు అన్యాక్రాంతమవుతూనే ఉన్నాయి.

ఈ క్రమంలో పీతలవానిపాలెం జాతీయరహదారిపై అడ్డగోలుగా గ్రీన్‌బెల్ట్‌లో వ్యాపారాలు సాగిస్తున్నా పట్టించుకోవడం లేదంటూ పలువురు విమర్శిస్తున్నారు. వార్డుకు సంబంధంలేని ప్రాంతాల్లో చెట్లు నరికి పర్యావరణం పాడు చేస్తున్నారని కోర్టులో కేసులు వేసిన నేతలు తమ ఇంటి పక్కనే సొంత వార్డులో పచ్చదనానికి తూట్లు పొడుస్తున్నా కిమ్మనకపోవడంలోని అంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు ఈ ప్రాంతంలో గ్రీన్‌బెల్ట్‌ల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పీతలవానిపాలెం జాతీయరహదారి పక్కన గ్రీన్‌బెల్ట్‌లో కార్ల వ్యాపారాలు

పర్యావరణ పరిరక్షణ కోసం యువత ముందుకు రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మురళీమోహన్

ఎంవీపీ కాలనీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు యువత బాధ్యతతో కృషి చేయాల్సిన అవసరం ఉందని భారత ప్రజారోగ్య సంస్థ కేంద్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ఎంవీవీ మురళీమోహన్ అన్నారు. ఎంవీపీ కాలనీలోని సెవెంత్ డే అడ్వెంటిస్ట్ విద్యా సంస్థలో వ్యూస్ సంస్థ కో-ఆర్డినేటర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో గురువారం క్లైమెట్ ఫర్ యూత్ యాక్షన్ వర్క్ షాప్ నిర్వహించారు. ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ సంస్థతో కలసి నిర్వహించిన ఈ సదస్సులో మురళీమోహన్ మాట్లాడుతూ శీతోష్ణస్థితి వేడెక్కకుండా పర్యావరణ పరిరక్షణకు యువత పూర్తి స్థాయిలో తగిన కృషి చేయాలన్నారు. మొక్కలు పెంచడం, అడవులు, కొండలు, గుట్టలు పరిరక్షించడం, నదులు, వాగులు, సముద్రాలలోకి హానికరమైన రసాయనాలు, భార లోహాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు వెళ్లకుండా చూడడం, ప్రజల్లో చైతన్యం తేవడం విధిగా భావించాలన్నారు. సంస్థ ప్రిన్సిపాల్ నవీన్ కుమార్, హెచ్ఎం జితేందర్ సింగ్, ఎకో వారియర్ జేవీ రత్నం, గ్రీన్ వలంటీర్ రవితేజ, కృష్ణకుమారి, ఉపాధ్యాయురాలు స్వాతి సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

ఎక్సెస్ టూ జస్టిస్ ఫర్ చిల్డ్రన్ ఆఫ్ హోల్డ్ ఎన్‌జీవో సంస్థ పిలుపు



అవగాహన ర్యాలీలో పాల్గొన్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను అరికట్టాలని ఎక్సెస్ టూ జస్టిస్ ఫర్ చిల్డ్రన్ ఆఫ్ హోల్డ్ ఎన్‌జీవో సంస్థ పిలుపునిచ్చింది. ఎంవీపీ కాలనీతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో భారీ ర్యాలీ నిర్వహించింది. సంస్థ జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో బాల్య వివాహ ముక్త్ భారత్ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 50 ప్రాంతాల్లో 5 వేల మంది గ్రామస్థులతో చేతులు కలిపి కార్యక్రమం చేపట్టినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇందులో పాల్గొన్న స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలు ప్లకార్డులతో అవగాహన కలిగించారు. నినాదాలు చేశారు. లఘు నాటికలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ సహకారంతో చైతన్య యాత్రలు చేస్తున్నట్లు డేవిడ్ రాజు తెలిపారు. బాల్య వివాహాలను నిరోధించడం కోసం జాతీయ పోర్టల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. బాలల హక్కుల కార్యకర్త భువన్ రిభు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ లా కళాశాలలో 'కాంపిటీషన్ లా - తాజా సవరణలు'పై సదస్సు



కేపీ ఆనంద్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో గురువారం 'కాంపిటీషన్ లా - తాజా సవరణలు' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సదస్సుకు చెన్నై నుంచి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (దక్షిణ రీజన్) రీజనల్ ఇన్‌చార్జి, జాయింట్ డైరెక్టర్(లా) కేవీ ఆనంద్ పాల్గొని ప్రసంగించారు. కాంపిటీషన్ లా లో జరిగిన తాజా సవరణలపై విస్తృత, సమగ్ర వివరణను ఇచ్చారు. ఈ సవరణల ప్రాముఖ్యతను, సవరణల వలన వ్యాపార, న్యాయ రంగాలలో కలిగే ప్రభావాలను వివరించారు. నిజ జీవితం నుంచి ఉదాహరణలు ఉపయోగించి, ఈ మార్పులు భారతదేశంలో పోటీపై ఎలాంటి ప్రభావం చూపిస్తున్నాయో వివరించారు. అలాగే క్లిష్టమైన న్యాయ అంశాలను వాటి మూల సూత్రాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.సీతామాణిక్యం మాట్లాడుతూ కార్పొరేట్ ప్రపంచంలో సమాన పోటీ ప్రాముఖ్యతను స్పష్టం చేశారు. అలాగే కాంపిటీషన్ లా ప్రపంచంలో సమాన అవకాశాలను కల్పించడం, ఆవిష్కరణను ప్రోత్సహించడం, వినియోగదారుల ప్రయోజనాలను రక్షించడంలో ఎంత కీలకంగా ఉందో వివరించారు. అనంతరం ఏయూ వీసీ జి.శశిభూషణరావుతో కేపీ ఆనంద్ బేటీ అయ్యారు. ఈ సందర్భంగా తమ సంస్థ చేస్తున్న కార్యక్రమాలను వీసీకి ఆనంద్ వివరించారు.ఈ సందర్భంగా ఆనంద్‌ను వీసీ జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

అధ్యయన కేంద్రాలు అనుసంధానకర్తలుగా వ్యవహరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంచాలకుడు ధర్మారావు

ఎంవీపీ కాలనీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అధ్యయన కేంద్రాలు విద్యార్థులకు అనుసంధాన కర్తలుగా పని చేయాలని ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్ర సీనియర్ సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు అన్నారు. గురువారం 2024-25 సంవత్సరానికి విశాఖలోని అధ్యయన కేంద్రాల సమన్వయకర్తల సమావేశం ఉషోదయా కూడలిలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూరవిద్యా విధానంలో అధ్యయన కేంద్రాలు ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. ఇగ్నో ఎన్నో ఆధునిక సాంకేతిక మార్గాలకు దారులు తెరిచి, లక్షలాది మంది విద్యార్థులకు సేవలు అందిస్తోందని తెలిపారు. ఇగ్నో కేంద్రం ఉప సంచాలకులు డాక్టర్ ఇ.కృష్ణారావు మాట్లాడుతూ కొత్త అడ్మిషన్లు, కొత్త కోర్సులు, విద్యార్థులకు అందించాల్సిన సేవలను వివరించారు. ఇగ్నో విభాగాధికారి వీవీ పతిరావునాయుడు అధ్యయన కేంద్రాల నిర్వహణ, ఆర్థిక అంశాలను వివరించారు.

అవగాహనతో రొమ్ము కేన్సర్ నిర్మూలన సాధ్యం

» డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ కె.సీతామాణిక్యం



సీతామాణిక్యంకు జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

వెంకోజీపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అవగాహన పెంచుకొని వైద్య పరీక్షలు చేసుకుంటూ రొమ్ము కేన్సర్‌ను నివారించుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ కె.సీతామాణిక్యం అన్నారు. జాతీయ సేవా పథకం, యువరాజ్ సింగ్ ఫౌండేషన్, దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం సంయుక్తంగా గురువారం ఎన్ఎస్ఎస్ సమావేశంలో నిర్వహించిన రేడియేషన్ లేని రొమ్ము క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీతామాణిక్యం మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్ ఇటీవల కాలంలో గణనీయంగా పెరుగుతోందని తగిన జాగ్రత్తలు వహిస్తూ తరచూ పరీక్షలు నిర్వహించుకుంటూ మహిళలు సురక్షితంగా ఉండాలని సూచించారు. ఆధునిక పరికరాలు, చికిత్స విధానాలు అందుబాటులోకి వచ్చాయని వీటిని సద్వినియోగం చేసుకుంటే క్యాన్సర్‌ను నివారించడం జరుగుతుందన్నారు. తొలి దశల్లో దీన్ని గుర్తించడం వలన త్వరిగతిన చికిత్స, ఉపశమనం పొందడం సాధ్యపడుతుందని చెప్పారు. దుర్గాబాయ్ దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఎ.పల్లవి మాట్లాడుతూ యువతులు, మహిళలు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎస్.హరినాథ్ పాల్గొన్నారు.

భవానీలకు అన్నసమారాధన ప్రారంభం

ఆరిలోవ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12 వ వార్డులో గల సూర్యతేజనగర్ పోలమాంబ ఆలయంలో అయ్యప్పలకు భవానీలకు అన్న సమారాధన కార్యక్రమాన్ని ఉపకార్ చారిటబుల్ ట్రస్టు అధినేత ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్ చైర్మన్ కంచెర్ల అచ్యుతరావు గురువారం ప్రారంభించారు. ఇందుకు అవసరమైన నిధులు తాను అందిస్తున్నట్లు తెలిపారు. సుమారు 18 రోజుల పాటు ఈ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

సుమారు 300 పైగా స్వాములు భవానీలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫుడ్ కార్నివాల్



వివిధ రాష్ట్రాల వంటకాలను ప్రదర్శించిన విద్యార్థులు

వెంకోజీపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సోషల్ వీక్ వేడుకలలో భాగంగా గురువారం ఇసుకతోటలోని శ్రీచైతన్య టెక్నో స్కూలులో ఫుడ్ కార్నివాల్‌ను నిర్వహించారు. భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఆహార పదార్థాలను విద్యార్థులు తమ ఇంటి వద్ద నుంచి తయారు చేసుకుని తీసుకువచ్చి పాఠశాల ఆవరణలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్కూలు ప్రిన్సిపాల్ ఎన్వీ రమణి మాట్లాడుతూ విద్యార్థులు చిన్న తనం నుంచి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కలిగించాలనే ఉద్దేశంతో ఈ ఫుడ్ కార్నివాల్‌ను నిర్వహించామన్నారు. విద్యార్థులంతా పాల్గొని తమ ప్రతిభను కనబరచడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం

వెంకోజీపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో రైవాడ మంచినీటి సరఫరా పథకం ద్వారా నరవ నుంచి టీఎస్ఆర్‌కు వచ్చే తాగు నీటి సరఫరా ప్రధాన 800 పీఎస్‌సీ పైపులైను బిర్లా జంక్షన్ కూడలి వద్ద లీక్ అయింది. దీనికి మరమ్మతు చేస్తుండడంతో జోన్ 3, 5, 8 గల ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీరు కేవీఎన్ రవి ఒక ప్రకటనలో తెలిపారు. జోన్-3 పరిధిలో గల డాక్టర్స్ కాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ, ఎంఎంటీసీ కాలనీ, అంబేడ్కర్ నగర్, ఇందిరానగర్ బొమ్మలైన్, చైతన్య నగర్, కనకమ్మ టెంపుల్ ప్రాంతం, కెప్టెన్ లైన్స్, గాంధీ నగర్ ఏరియా, శారదా స్కూల్ లైన్, ఓల్డ్ కోపరేటివ్ బ్యాంకు లైన్, కాంత్రి నగర్, ఎన్ హెచ్-16 రోడ్డు ఏరియా, రామకృష్ణనగర్ 80 ఫీట్ రోడ్డు ఏరియా, ఎన్జీజీవోఎస్ కాలనీ, చిన్నూరు, మంగళ వీధి, లలితానగర్ తదితర ప్రాంతాలలో అంతరాయం కలుగుతుందన్నారు.

అలాగే జోన్-5లో మర్రిపాలెం, జ్యోతినగర్, మహారాణి వీధి, బాపూజీనగర్, మాధవధార వుడా లే అవుట్, మాధవధార, కళింగనగర్, ఎన్జీజీవోఎస్ కాలనీ, పట్టాభిరెడ్డి తోట, సూర్యనగర్, సిద్దార్థనగర్, తుమ్మడిపాలెం, సుభాష్ నగర్, భవాని గార్డెన్, కస్తూరి నగర్-1, శాంతినగర్-1,2, సంజీవయ్య నగ ర్ హిల్ ఏరియా, బాపూజీ నగర్1, 2 అంబేడ్కర్ ఎస్టేట్, సురేష్‌రామ్ నగర్, పెద్దకొతూరు హిల్ ఏరియా, డౌన్ ఏరియా, రాంజీ ఎస్టేట్ డౌన్ ఏరియా తిక్కవానిపాలెం, జయప్రకాష్ నగర్, కప్పరాడ-1,2, ఇందిరానగర్ -4,5, మహాత్మాగాంధీ నగర్, జవహర్ లాల్ నగర్, ఏఎస్ఆర్.నగర్, శ్రీనివాస నగర్, పోలీసు క్వాటర్స్, పలనాటి కాలనీ, గోకుల్ నగర్, గొల్ల కంచరపాలెం, దుర్గ నగర్, శ్రీనివాస్ నగర్, నందగిరి నగర్, చెక్కుడు రాయ బిల్డింగు ఏరియా, దాడి రామ్మూర్తి కల్యాణ మండపం, 24/7 వాటర్ సప్లై ఏరియాలు తదితర ప్రాంతాలు..

జోన్-8 పరిధిలో గల శ్రీరామనగర్, శ్రీనుబాబు నగర్, అజంత పార్కు, టైలర్స్ కాలనీ, ఉడా కాలనీ, పవర్ ఆఫీస్ ఎదురుగా, ఆర్ఆర్వీ పురం రజక కాలనీ తదితర ప్రాంతాలలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని రవి తెలిపారు. శనివారం యథావిధిగా నీటి సరఫరా జరుగుతుందని తెలిపారు.

కార్మిక వ్యతిరేక చర్యలను అడ్డుకోవాలి

ఎంజీఎం సెవెన్‌హిల్స్ ఆస్పత్రి తీరుపై నిరసన



ఆందోళన నిర్వహిస్తున్న జిల్లా హాస్పిటల్ అండ్ నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ నేతలు

సిరిపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎంజీఎం సెవెన్‌హిల్స్ హాస్పిటల్ కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని, వాటిని అరికట్టాలని, కార్మిక శాఖ పక్షపాత వైఖరిని విడనాడాలని జిల్లా హాస్పిటల్ అండ్ నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జిల్లా హాస్పిటల్ అండ్ నర్సింగ్ అండ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి వైరాజు మాట్లాడుతూ సెవెన్‌హిల్స్ యాజమాన్యం కొందరు కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. ఏళ్ల తరబడి సేవలు చేయించుకొని, ఇప్పుడు ఉద్యోగాలు తీసి వేస్తే వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వారికి ఎక్కడ ఉపాధి లభిస్తుందని, వారి కుటుంబాలు ఎలా బతకాలని పేర్కొన్నారు.

యథావిధిగా కొనసాగించాలన్నారు. కార్మికులు ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకోవాలని కార్మికులను న్యాయం చేయాలన్నారు. ఈ దీక్షలో నాయకులు కె.చంద్రశేఖర్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి వీఎమ్మార్డీఏ కల్యాణమండపం : ప్రణవ్‌గోపాల్



కల్యాణమండపం పరిశీలిస్తున్న ప్రణవ్ గోపాల్, ఎమ్మెల్యే వెలగపూడి, బొలిశెట్టి

ఎంవీపీ కాలనీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ఒకటో సెక్టరులో నిరుపయోగంగా ఉన్న వీఎమ్మార్డీఏ కల్యాణ మండపాన్ని త్వరలోనే అందుబాటులోకి తెస్తామని చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ తెలిపారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణతో కలిసి గురువారం ఆయన కల్యాణమండపం తాజా పరిస్థితిని పరిశీలించారు. ఒకప్పుడు పేద, మధ్య తరగతి వారికి అందుబాటులో ఈ కల్యాణమండపం ఉండేదని, ఆధునీకరణ పేరుతో దీనిని మూసివేయడంతో వెంటనే తిరిగి వినియోగించలేని పరిస్థితిలో ఉందని తెలిపారు. రూ. నాలుగు కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినా, శంకుస్థాపన చేసి, పనులు చేయకుండా వదిలేశారన్నారు. త్వరలో పనులు చేపట్టి ఈ కల్యాణ మండపాన్ని వినియోగంలోకి తెస్తామన్నారు.

పూలే ఆశయాలు ఆచరణీయం

» ఏయూ వీసీ శశిభూషణరావు



పూలెకు నివాళులు అర్పిస్తున్న వీసీ శశిభూషణరావు, పాల్గొన్న ఆచార్యులు, విద్యార్థులు

వెంకోజీపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిరావు పూలే వర్థంతిని పురస్కరించుకుని గురువారం ఏయూలో గల పూలే విగ్రహానికి ఏయూ వీసీ జి.శశిభూషణరావు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ ప్రగతిని కాంక్షించిన పూలే ఆశయాలు నేటికి ఆదర్శనీయమన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే అణగారిన వర్గాలకు బాసటగా నిలిచి వారి అభ్యున్నతికి కృషి చేశారన్నారు. మహిళా విద్యను ప్రోత్సహించి అత్యుత్తమ సామాజికవేత్తగా నిలిచారన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు మాట్లాడుతూ సమానత్వం, సాధికారిత కోసం పూలే దంపతులు చేసిన కృషిని మరువరాదన్నారు. ఇటువంటి మహనీయులను నేటితరం యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఆచార్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టైలరింగ్‌తో మహిళలకు ఆర్థిక ఆసరా



ధ్రువపత్రాలు అందుకున్న శిక్షణ పొందిన అభ్యర్థులు

ఆరిలోవ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కుట్టు మిషన్ శిక్షణతో మహిళలకు ఆర్థిక ఆసరా లభిస్తుందని, తద్వారా కుటుంబానికి అండగా నిలిచే అవకాశం ఉంటుందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు కె.వెంకటరమణ పేర్కొన్నారు. తోటగరువు సమీపంలో గల బీఎస్ఆర్ నగర్ సామాజిక భవనంలో రోటరీక్లబ్ విశాఖ పోర్టు సిటీ ద్వారా కుట్టు మిషన్‌లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సెంటర్ 2020లో పది మిషన్‌లతో ప్రారంభమైందన్నారు. ఇప్పటివరకు 200 మంది మహిళలు ఇక్కడ శిక్షణ పొందారని తెలిపారు. ఈసారి 26 మంది మహిళలు శిక్షణ పొందారన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వొకేషనల్ సర్వీస్ బి.శివాజీ, రొటేరియన్ బీఎస్ రాజు, కైలాస్ అగర్వాల్, టైలరింగ్ ట్రైనర్ కృష్ణవేణి, కళావతి, మైనిక పాల్గొన్నారు.

ఏడాకుల చెట్ల తొలగింపు



ఏడాకుల చెట్లను తొలగిస్తున్న ఉద్యానవన శాఖ సిబ్బంది

ఆరిలోవ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో ప్రెస్‌క్లబ్ సమీపంలో గల డబుల్‌రోడ్డులో రెండువైపులా ఏపుగా పెరిగిన ఏడాకుల చెట్లను గురువారం జీవీఎంసీ ఉద్యానవన శాఖ సిబ్బంది తొలగించారు. ఈ చెట్ల పూల నుంచి వెలువడుతున్న పుప్పొడి రేణువులు గాలిలో కలిసి శ్వాస సంబంధిత రోగాలకు కారణం అవుతుండడంతో వీటిని తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు ఆరిలోవ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి రోగాలకు కారణమవుతున్న చెట్లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ ఉద్యానవన శాఖ అధికారులు ఏడాకులు చెట్ల తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి రవి రమణ, ఉద్యానవనశాఖ అదికారి పాల్గొన్నారు.

టీచర్లకు శిక్షణ తరగతులను రద్దు చేయాలి

» యూటీఎఫ్ డిమాండ్

అక్కయ్యపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కాలయాపన, బోధనకు ఆటంకం కలిగించే విధంగా ఉన్న రెసిడెన్షియల్ శిక్షణ తరగతులను తక్షణమే రద్దు చేయాలని యూటీఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టీఆర్ అంబేడ్కర్ కోరారు. ఎఫ్ఎల్ఎన్, ఎస్ఎల్టీపీ పేరిట రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహిస్తున్న శిక్షణా కేంద్రంలో ఉపాధ్యాయులు మరణించడం చాలా దురదృష్టకరమన్నారు.

విజయనగరం జిల్లా గజపతినగరంలో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణా కేంద్రంలో ఉపాధ్యాయుడు గుండెపోటుతో మరణించడం పట్ల తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. మరణానికి బాధ్యులైన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇటువంటి మరణాలు సంభవించకుండా ఉండేందుకు తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న అన్ని శిక్షణా కార్యక్రమాలను రద్దు చేయాలన్నారు. లేకుంటే అన్ని ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

పని చేసిన ఇంటికే కన్నం వేశారు..

» ఆయిల్ వ్యాపారి ఇంట్లో చోరీ కేసును ఛేదించిన పోలీసులు

» 140 గ్రాముల బంగారం స్వాధీనం

పెందుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటనరవలో ఆయిల్ వ్యాపారి ఇంట్లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. మిల్లులో పనిచేసిన భార్యాభర్తలను అరెస్టు చేసి 140 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైమ్ జోన్-2 ఏసీపీ లక్ష్మణరావు వివరాలను వెల్లడించారు. కోటనరవకు చెందిన అప్పారావు గోపాలపట్నంలో ఆయిల్ మిల్లు నిర్వహిస్తున్నారు. ఒడిశాకు చెందిన దంపతులు సంజయ్, రష్మితలను మిల్లు ఇంటి పనుల కోసం నియమించుకున్నారు. ఈ ఏడాది జూన్ 11 రాత్రి నరవలో పండగకు అప్పారావు కుటుంబసభ్యులు వెళ్లారు. తిరిగి 12 గంటల సమయంలో వచ్చేసరికి తలుపు తాళం విరగ్గొట్టినట్టు గుర్తించారు. బీరువాలో ఉంచిన 18 తులాల బంగారం, రూ.3లక్షల నగదు, బైక్ కనిపించలేదు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉంటున్న భార్యాభర్తలు కూడా కనిపించకపోవంతో అప్పారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేశారు. సాంకేతికత సాయంతో నిందితులను గుర్తించి, ఒడిశాలోని గంజాం జిల్లా బందుగుడలోని సోదేన్లపల్లికి చెందిన సంజయ్‌గౌడ్, రష్మితా నాయక్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా జగన్నాథ్ జోగితో కలిసి చోరీ చేసినట్టు అంగీకరించారు. జోగి కోసం గాలిస్తున్నామని ఏసీపీ తెలిపారు. సమావేశంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ డి.సూరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

135 కిలోల గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు


స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

కూర్మన్నపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పాడేరు నుంచి తమిళనాడుకు తరలిస్తున్న గంజాయిని దువ్వాడ పోలీసులు పట్టుకున్నారు. జోన్-2 డీసీపీ మేరి ప్రశాంతి వివరాలను వెల్లడించారు. పాడేరు నుంచి తమిళనాడుకు తరలిస్తున్నట్టు సమాచారం మేరకు అగనంపూడి టోల్‌గేటు ప్రాంతంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ వాహనంలో గంజాయిని గుర్తించి గన్నవరానికి చెందిన తాడిశెట్టి దుర్గారావు, ఏలూరుకు చెందిన డి.శివరామకృష్ణలను అదుపులోకి తీసుకున్నారు. సుమారు రూ.ఐదు లక్షల విలువైన 135 కిలోల గంజాయితో పాటు ఆలివ్ ఆయిల్, వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేశారు. సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, సీఐ మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో పది కిలోలు లభ్యం

సీతంపేట: రైల్వే స్టేషన్‌లో సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ వెంకటరావు తనిఖీలు చేస్తుండగా కోచ్ రెస్టారెంట్ సమీపంలో ఫుట్‌పాత్‌పై బ్యాగ్ కనిపించింది. అందులోని పది కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

నేడు పెందుర్తిలో జాబ్ మేళా

అక్కయ్యపాలెం, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. మేళాలో లీ ఫార్మా, కేఎల్ గ్రూప్, టీఏఓ డిజిటల్, నవతా రోడ్డు ట్రాన్స్‌పోర్టు కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్ పూర్తిచేసిన వారంతా హాజరుకావచ్చని, ఎంపికైన వారు విశాఖపట్నం, గాజువాక, చెన్నైలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9014766143 నంబరులో సంప్రతించాలన్నారు.

నలుగురు సీఐలకు పోస్టింగ్స్

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్‌కమిషనరేట్ పరిధిలో నలుగురు సీఐలకు పోస్టింగ్‌లు ఇస్తూ సీపీ శంఖబ్రతబాగ్చి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వీఆర్‌లో ఉన్న జి.ఉమామహేశ్వరరావుకు ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్, అక్కడ పనిచేస్తున్న వి.చక్రధరరావుకు ద్వారకాసబ్‌డివిజన్ క్రైమ్ సీఐగా పోస్టింగ్ ఇచ్చారు. సోషల్‌మీడియా సెల్‌లో పనిచేస్తున్న జి.అప్పారావుని గోపాలపట్నం పోలీస్‌స్టేషన్‌కు, అక్కడ పనిచేస్తున్న కె.సురేష్‌ను సోషల్‌మీడియాసెల్‌కు బదిలీచేశారు. ద్వారకా క్రైం సీఐగా పనిచేస్తున్న డి.బంగారుపాపను రేంజ్‌కు సరండర్ చేశారు.

జీవీఎంసీ డీపీఓగా మనీషా త్రిపాఠి

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ డిప్యూటీ ప్రాజెక్టు అధికారి(డీపీఓ)గా కెప్టెన్ మనీషా త్రిపాఠికి పోస్టింగ్ ఇస్తూ మున్సిపల్‌శాఖ ప్రధాన కార్యదర్శి కన్నబాబు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఆమె ప్రస్తుతం అనకాపల్లి జిల్లా సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ ఏడీగా పనిచేస్తున్నారు. ఏడాది పాటు డిప్యూటేషన్‌పై ఆమెను జీవీఎంసీలో డీపీఓగా నియమించారు.

క్రీడా పోటీల నిర్వహణకు సహకరించాలి

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలో మూడు రోజుల పాటు స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు అంతర్రాష్ట్ర క్రీడా పోటీలు జరగనున్నాయని, నిర్వహణకు అధికారులంతా సహ కరించాలని విజయనగరం జోన్ ఈడీ ఎ.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఎంవీపీకాలనీలోనీ ఈడీ క్యాంప్‌కార్యాలయంలో గురువారం ఆయన ఆహ్వాన, రవాణా, వసతి, ఆహారం, క్రీడాప్రాంగణం, మెడికల్, భద్రత కమిటీల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వచ్చేనెల 6 నుంచి మూడు రోజులు కైలాసగిరి పోలీస్ క్రీడా ప్రాంగణంలో స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు అంతర్రాష్ట్ర క్రీడా పోటీలు జరుగనున్నాయని, అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు అండర్ టేకింగ్ పోటీలు నిర్వహిస్తుందన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాల క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారన్నారు. వారికి వసతి సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రతి అధికారి వ్యక్తిగతంగా పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో ఆర్టీసీ ఆర్ఎం బి.అప్పలనాయుడు, కె.పద్మావతి, సీహెచ్ అప్పలనారాయణ, జి.సత్యనారాయణ, సుధాబిందు, శ్రీనివాసరావు, ఐవీవీపీ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ హౌస్

» మీ ఇల్లే ఓ విద్యుదుత్పత్తి కేంద్రం

» కేంద్ర ప్రభుత్వ రాయితీతో సౌర విద్యుత్ సులభతరం

» ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనతో తగ్గనున్న విద్యుత్ బిల్లుల భారం

» గృహ వినియోగదారులకు మాత్రమే వర్తింపు



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

సహజ వనరులను రక్షించుకునేందుకు, ప్రకృతిని సంరక్షించుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో నీరు, బొగ్గు ఆధారిత విద్యుత్‌కు బదులుగా సౌర విద్యుత్ వెలుగులు గ్రామాల్లో నింపాలనే ఉద్దేశం ఒకటి. కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కారు తీసుకువచ్చిన ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా విద్యుత్ వినియోగదారుల ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌లను కేంద్ర ప్రభుత్వం రాయితీతో అందించనుంది. ఈ పథకంలో నమోదై ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్‌లను అమర్చుకోవడం ద్వారా వినియోగదారుడు తమకు కావాల్సిన కరెంట్‌ను వాడుకుని మిగులు విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించవచ్చు. వినియోగదారుడే ఉత్పత్తిదారుడిగా మారే అవకాశం ఈ పథకం ద్వారా మారే అవకాశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి. ప్రస్తుతం ఈ పథకాన్ని గృహోపయోగానికి వర్తింపజేస్తున్నారు. పథకం కింద లబ్ధి పొంది నెలవారీ విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకోవచ్చు.



ఒక కిలో వాట్ సామర్థ్యంగల సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుంటే నెలకు 120 యూనిట్లు విద్యుదుత్పత్తి అవుతుంది. వినియోగదారుడికి ప్రస్తుత వస్తున్న బిల్లు రూ.1000 అయితే సోలార్ ఏర్పాటు తర్వాత వచ్చే బిల్లు 338 మాత్రమే. ఏడాదికి రూ.8వేలు ఆదా అవుతుందని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. ఇంటి పైకప్పుపై కనీసం 10 చ.మీ లేదా 100 చదరపు అడుగుల స్థలంలో ఒక కేవీపీ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుచేసుకోవచ్చు. రెండు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్‌టాప్ ఏర్పాటుచేసుకుంటే నెలకు 240 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చు. దీనిద్వారా నెలకు రూ.2 వేల విద్యుత్ బిల్లు వచ్చే వినియోగదారుడికి రూ.333 మాత్రమే వచ్చే అవకాశం ఉంటుంది. ఏడాదికి రూ.20 వేలు ఆదా అవుతుంది. ఇక మూడు కిలోవాట్ల రూఫ్‌టాప్ ఏర్పాటుచేసుకుంటే నెలకి 360 యూనిట్లు ఉత్పత్తి జరుగుతుంది. రూ.3వేల వరకు వచ్చే బిల్లు రూ.293కు తగ్గనుంది. దీని ద్వారా ఏడాదికి రూ.32,400 ఆదా. ఈ పథకంలో లబ్ధిదారుడికి కేంద్రం నుంచి ఒక కిలో వాట్‌కు రూ.30వేలు, రెండు కిలో వాట్లకు రూ.60వేలు, మూడు కిలోవాట్లు, అంతకు మించినా రూ.78వేల వరకు రాయితీ లభిస్తుంది.

నమోదు చేసుకోవడమిలా..

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలో పేర్లు నమోదు చేసుకునేందుకు యాప్‌లో, ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో వెండర్ల (కాంటాక్టర్లు) వివరాలుంటాయి. పేరు నమోదు చేసుకున్న తరువాత తమకు నచ్చిన వారిని ఎంచుకోవచ్చు. తమ ఇంటికి ఎన్ని కిలో వాట్ల విద్యుత్ అవసరమో ఎంచుకుని నమోదు చేసుకోవాలి. ఒకటి, రెండు, మూడు కిలోవాట్ల వరకు వర్తింపజేస్తారు.

మిగులు విద్యుత్‌కు నగదు చెల్లింపు

ఇళ్లపై బిగించిన సోలార్ రూఫ్ టాప్‌ల ద్వారా విద్యుదుత్పత్తి అవుతుంది. అక్కడి నుంచి తిరిగి ఇళ్ల సర్వీస్ తీగల నుంచి ఇంటి అవసరాలకు విద్యుత్ సరఫరా అవుతుంది. విద్యుత్ సరఫరా, వినియోగం ఎంతమేర అనేది సోలార్ యూనిట్ ద్వారా అమర్చిన ప్రత్యేక మీటర్‌లో నమోదవుతుంది. సౌర ఫలకల ద్వారా ఒక ఇంటి నుంచి ఎంతమేర విద్యుదుత్పత్తి అయింది, ఎంత వినియోగించారు, మిగులు విద్యుత్ ఎంత అనే లెక్కలు మీటర్‌లో నమోదవుతాయి. వినియోగదారుడు సౌరవిద్యుత్ ఉత్పత్తి కంటే అధికంగా వినియోగిస్తే అందుకు తగ్గ బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. మిగులు ఉంటే విద్యుత్‌శాఖ అధికారులు ఆరు నెలలకు ఒకసారి లెక్కించి యూనిట్‌కు ప్రస్తుత మార్కెట్ ధర రూ.2.90 చొప్పున చెల్లిస్తారు.

వినియోగదారుడే ఉత్పత్తిదారుడు



ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా గృహ వినియోగదారుడు విద్యుదుత్పత్తిదారుడిగా మారే అవకాశం కలుగుతుంది. అధిక ప్రయోజనాలు కలిగిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, నచ్చిన వెండర్ల ద్వారా సోలార్ రూఫ్‌టాప్‌లను అమర్చుకోవాలి. దీనిపై వినియోగదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు వీలుగా ఇటీవల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశాం. అక్కడ వెండర్లతో స్టాళ్లు ఏర్పాటు చేసి, సౌర విద్యుత్ వినియోగంతో కలిగే లాభాలను వివరించాం.

- పృథ్వీతేజ్, సీఎండీ, ఏపీ ఈపీడీసీఎల్

ఉక్కు ఉద్యోగులకు జీతాలివ్వండి

» మంత్రి కుమారస్వామిని కోరిన విశాఖ ఎంపీ శ్రీభరత్


మంత్రి కుమారస్వామితో ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయని ఎంపీ శ్రీభరత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని ఢిల్లీలో కలిశారు. విశాఖ ఉక్కులో రెండో బ్లాస్ట్ ఫర్నేస్ ప్రారంభానికి తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా ప్రశంసించారు. స్టీల్‌ప్లాంటు దీర్ఘకాలం మనుగడ సాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖ ఆర్థికాభివృద్ధిలో ఉక్కు కర్మాగారం పాత్ర పోషించేందుకు సహకరించాలని కోరారు. జీతాల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని, మిగిలిన వాటిపై తగిన నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

మారిన టీచర్ల శిక్షణ సరళి

భీమునిపట్నం (రూరల్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈఓలకు నాయకత్వ లక్షణాలపై రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహిస్తున్న శిక్షణ సరళిని ఉన్నతాధికారులు మార్పు చేశారు. విజయనగరం జిల్లా గజపతినగరంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు గురువారం గుండెపోటుతో మృతి చెందారు. రాజాపులోవలో జరుగుతున్న శిక్షణలోని ఉపాధ్యాయులకు విషయం తెలియడంతో శిక్షణ బహిష్కరించి, ఆందోళనకు దిగారు. డీఈఓ ప్రేమ్‌కుమార్ వారితో చర్చలు జరిపారు. అనంతరం ఆర్‌జేడీ విజయభాస్కర్ మాట్లాడుతూ అనారోగ్యం ఉన్న వారికి మినహాయింపు ఇస్తున్నామని, అత్యవసర మందులను అందుబాటులో ఉంచామన్నారు. శిక్షణ సమయాన్ని కూడా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మార్చామన్నారు.

అనంతుని దీపోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

» ఆర్డీఓ ఆధ్వర్యంలో 14 మంది అధికారులకు బాధ్యతలు


ప్రథమ పావంచా వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు (ఇన్‌సెట్లో) పద్మనాభస్వామి

పద్మనాభం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పద్మనాభంలోని అనంతపద్మనాభుని దీపోత్సవం ఈనెల 30న నిర్వహించడానికి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా ఈ ఉత్సవాన్ని కార్తీక బహుళ అమావాస్య రోజున నిర్వహిస్తారు. ప్రథమ పావంచా నుంచి గిరి శిఖరం వరకు ఉన్న 1,286 మెట్లకు ఇరువైపులా ప్రమిదలలో నూనె దీపాలను వెలిగిస్తారు. ఉత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలివస్తారు. ఇప్పటికే అనంతుని గిరి మెట్ల మార్గానికి ఇరువైపులా తుప్పలు తొలగించారు. మెట్లకు సున్నం వేసి తీర్చిదిద్దారు. కుంతీమాధవస్వామి ఆలయం, ప్రథమ పావంచా వద్ద దర్శనానికి వచ్చే భక్తులకు బారికేడ్లను ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాలతో ఆలయాలను అలంకరించారు. గిరిపైన ఆలయం పునర్నిర్మాణంలో ఉండడంతో స్వామి దర్శనానికి వీలుగా ఉత్సవ విగ్రహాలను ఉంచేందుకు ప్రత్యేక వేదికను ఏర్పాటుచేస్తున్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచనల మేరకు ఆర్డీఓ కె.సంగీత్ మాధుర్ 14 మంది అధికారులకు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో నార్త్‌జోన్ ఏసీపీ అప్పలరాజు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఉత్సవం రోజున భక్తులు తెల్లవారు జాము నుంచి గిరి మెట్లకు పసుపు, కుంకుమలను రాసుకుంటూ గిరిని అధిరోహిస్తారు. వారికి ఉదయం 5 గంటల నుంచి దర్శనం కల్పించేలా చర్యలు తీసుకున్నారు. ఉత్సవం రోజున సాయంత్రం నాలుగు గంటలకు కుంతీమాధవస్వామి ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రథమ పావంచా వద్ద ఉంచి పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు. కొండపై 5.30 గంటలకు జేగంట కొట్టగానే భక్తులు గోవిందనామ స్మరణతో దీపాలను వెలిగిస్తారు.

కిరండోల్ రైలుకు అదనపు కోచ్‌లు

డిసెంబరు 1 నుంచి జనవరి 2 వరకూ...

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-కిరండోల్ రైలు (08551)కు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో వాల్తేరు డివిజన్ అధికారులు ఒక స్లీపర్ కోచ్, థర్డ్ ఏసీ కోచ్ ఒకటి అదనంగా ఏర్పాటుచేశారు. స్లీపర్ కోచ్ డిసెంబరు 1 నుంచి 31 వరకూ, అటు నుంచి వచ్చే రైలు (08552)కు డిసెంబరు 2 నుంచి జనవరి 1 వరకు అందుబాటులో ఉంటుంది. ఇక థర్డ్ ఏసీ కోచ్‌ను ఇటు నుంచి డిసెంబరు 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28, 30, జనవరి 1 తేదీల్లో, అటు నుంచి వచ్చే రైలుకు డిసెంబరు 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29, 31, జనవరి 2వ తేదీల్లో జత చేస్తారు.

రైళ్ల మళ్లింపు

భద్రతాపరమైన పనులు జరుగుతున్నందున గుంతకల్ డివిజన్‌లో రైళ్లను నంద్యాల-ఎర్రగుంట్ల-గూటీ-అనంతపురం మీదుగా నడుపుతారు. సాధారణంగా ఈ మార్గంలో రైళ్లు నంద్యాల-డోన్ మీదుగా అనంతపురం వెళతాయి. ఇప్పుడు డోన్‌కు రైళ్లు వెళ్లవు. పూరీ-యశ్వంత్‌పూర్ రైలు (22883) వచ్చే నెల 6న మళ్లింపు మార్గంలో వెళుతుంది. యశ్వంత్‌పూర్-పూరీ (22884) డిసెంబరు 7న మళ్లింపు మార్గంలో నడుపుతారు. హౌరా-యశ్వంత్‌పూర్ (22831) డిసెంబరు 4 నుంచి 11వ తేదీ వరకు, యశ్వంత్‌పూర్-హౌరా (22832) రైలు డిసెంబరు 6 నుంచి 13వ తేదీ వరకూ మళ్లింపు మార్గంలో నడుపుతారు.

నేటి నుంచి గాదిరాజు ప్యాలెస్‌లో క్రెడాయ్ ప్రాపర్టీ షో


సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ రాజు, ప్రతినిధులు

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీచ్ రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో ఈ నెల 29, 30, 31 తేదీలలో క్రెడాయ్ ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నట్టు విశాఖపట్నం చాప్టర్ ఛైర్మన్ కేఎస్ఆర్‌కే రాజు (సాయి) తెలిపారు. గాదిరాజు ప్యాలెస్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంలో పెట్టుబడికి అనేక మంది ఆసక్తి చూపుతున్నారన్నారు. అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, భోగాపురం వరకు ఉన్న ప్రాజెక్టులన్నీ ప్రదర్శనలో పెడుతున్నామన్నారు. ఉపాధ్యక్షులు అశోక్‌కుమార్ మాట్లాడుతూ అపార్ట్‌మెంట్లు, విల్లాలు, ఇళ్ల స్థలాలు, ఇంటీరియర్ స్టాళ్లు ప్రదర్శనలో ఉంటాయన్నారు. షో కన్వీనర్ గోవిందరాజు మాట్లాడుతూ 71 స్టాళ్లు, లీడింగ్‌లో ఉన్న 25 మంది బిల్డర్ల ప్రాపర్టీలతో పాటు వీఎంఆర్‌డీఏ తన ప్లాట్లను అందుబాటులోకి తీసుకువస్తుందన్నారు. ఎస్‌బీఐ, యూబీఐ కెనరా బ్యాంక్‌తో పాటు మరో మూడు ఆర్థిక సంస్థలు రుణాలు ఇవ్వడానికి ముందుకు వచ్చాయన్నారు. చాప్టర్ కార్యదర్శి వి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఐపీఎల్ క్రికెటర్లు


సింహాచలం కొండపై ఐపీఎల్ క్రికెటర్లు

సింహాచలం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని ఐపీఎల్ క్రికెటర్లు కిరణ్ శర్మ, ఆశుతోష్ శర్మతో పాటు ఉడిపి శిరూర్ మఠానికి చెందిన వేదవర్ధన తీర్థ స్వామీజీ గురువారం దర్శించుకున్నారు. వారికి దేవాలయ ఏఈఓ ఆనందకుమార్, పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండప ప్రదక్షిణ చేసిన ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నగర సుందరీకరణ ప్రాజెక్టులు రూపొందించండి

» స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ సమీక్షలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగర సుందరీకరణ, అభివృద్ధిని పరిగణనలో తీసుకుని ప్రాజెక్టులు రూపొందించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. తన ఛాంబర్‌లో స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను గురువారం కలెక్టర్ సమీక్షించారు. ఇప్పటివరకు చేపట్టిన పనులు, భవిష్యత్తులో చేపట్టబోయే ప్రాజెక్టులపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని పలు సూచనలు ఇచ్చారు. ప్రజా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని కొత్త పనులు ప్రతిపాదించాలన్నారు. ముఖ్య కూడళ్ల అభివృద్ధి, సుందరీకరణ, తాగునీటి సదుపాయాల మెరుగుదల, మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించాలన్నారు. సమీక్షలో ఆమోదించిన పనులను నిర్ణీత వ్యవధిలో పూర్తిచేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాల మేరకు ప్రాజెక్టులు చేపట్టాలని పేర్కొన్నారు. స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ బోర్డులోకి కొత్తగా వచ్చిన డైరెక్టర్ల వివరాలను సమీక్షలో ప్రవేశపెట్టగా ఆమోదించారు. కంపెనీ సెక్రటరీ అజెండాలో అంశాలను కొన్ని ఆమోదించగా మరికొన్నింటికి స్వల్ప మార్పులు చేశారు. సమీక్షలో స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ కంపెనీ సెక్రటరీ కుసుమాంబ, సీఎఫ్‌వో ఆనంద్, జీవీఎంసీ సీఈ శివప్రసాదరాజు, ఏడీసీ వర్మ ఇతర అధికారులు పాల్గొన్నారు.